News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :193 | ఖమ్మం | బుధవారం, ఆగస్టు 19, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## భారత్‌లో 100 కోట్ల మందికి ఓటరు గుర్తింపు కార్డులు

- ట్రంప్ పోస్ట్ నేపథ్యంలో ఈసీ కీలక ప్రకటన!
- దేశంలో దాదాపు 100 కోట్ల మంది ఓటర్లకు ఫొటో గుర్తింపు కార్డులు జారీ
- ఈసీ కీలక ప్రకటన- ఓటర్ ఐడీల ప్రాధాన్యతను వివరిస్తూ ట్రంప్ భారత్‌ను ఉదాహరణగా చూపడంతో వివరాల్ని వెల్లడించిన ఈసీ




## 26/11 నిందితులపై 'ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా'

- ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు ఎంతటి చర్యలకైనా సిద్ధమన్న కేంద్రం
- 26/11 ముంబయి దాడుల కేసులో పాకిస్థాన్‌కు చెందిన ఆరుగురు నిందితులపై ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా
- నిందితులు లేకున్నా విచారణ ప్రారంభం
- ఉగ్రవాదాన్ని తుదముట్టించడమే భారత లక్ష్యమని ఎంఈఏ స్పష్టం





## విద్యార్థుల మాట ప్రభుత్వం వినడం సంతోషకరంగా ఉంది

- ఇదే సరైన మార్గం: రాహుల్ గాంధీ
- విద్యార్థులు, ఝార్ఖండ్ ప్రభుత్వం మధ్య ఏకాభిప్రాయం కుదరడంపై రాహుల్ గాంధీ హర్షం
- విద్యార్థుల భవిష్యత్తుకు న్యాయం జరిగేలా దేశవ్యాప్తంగా వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని వెల్లడి



## ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది

- మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపణ
- ఓటర్ల జాబితా నుంచి భారీగా ఓట్లు తొలగించారని ఆరోపణ
- సుమారు 73 లక్షల ఓట్లు తొలగించారన్న మహేశ్ కుమార్ గౌడ్
- బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని విమర్శ
- ఈసీని కేంద్రం పాకెట్ సంస్థగా మార్చిందంటూ వ్యాఖ్య

హైదరాబాద్

తెలంగాణలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం (ఈసీ) విచక్షణారహితంగా లక్షలాది ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ముసాయిదా ఓటరు జాబితా విడుదలైన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించలేదని, ఈ ఓట్ల తొలగింపు ప్రక్రియ వల్ల పేదలు, వలస కార్మికులే ఎక్కువగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకోవడం ఆచరణ సాధ్యం కాదని, పాత రికార్డులను వివరాలు 2లో..

# మళ్లీ వచ్చేది మనమే

- 117 సీట్లతో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా
- కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం
- అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలి సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం
- ట్యాంక్‌బండ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు
- బీఆర్‌ఎస్‌పై విమర్శలు గుప్పించిన సీఎం
- సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం స్ఫూర్తి నింపేలా



హైదరాబాద్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఏ ఒక్క కులానికో, మతానికో పరిమితం కాలేదని, బహుజనులను ఏకతాటిపైకి తెచ్చి గోల్కొండ కోటపై జెండా ఎగురవేశారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రజాపాలనను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరలు గద్దెనెక్కేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తెలంగాణ చరిత్రలోనే బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రులు, గౌడ సంఘాల నేతల వివరాలు 2లో..



## విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణలో జాప్యం వద్దు

- విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేయాల్సిందేనన్న కాక్రోచ్ జనతా పార్టీ
- కోర్టు అడిగిన ఎఫ్ఐఆర్‌ల జాబితాను ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్న
- విద్యార్థులకు సంబంధించిన అసలు సమస్య ఆందోళనల్లో పాల్గొన్నందుకు నమోదైన కేసులను రద్దు చేయడమే

# మధ్యవర్తులను ఆశ్రయించొద్దు



- 22ఏ భూములు విషయంలో కట్టు కథలు నమ్మొద్దు, దళారులను ఆశ్రయించొద్దు : సీఎం రేవంత్
- 22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- ప్రజల ఆస్తి పరిరక్షణకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని వెల్లడి
- ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపడతాం

హైదరాబాద్

ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆస్తులు కలిగిన వారు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు. 22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు సమీక్ష నిర్వహించారు. రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకొన్న వారి ఆస్తులు 22-ఏ జాబితాలో ఉంటే, రెవెన్యూ అధికారులు రెండు రోజుల్లో పరిశీలించి, అది ప్రైవేటు భూమి అయితే రిజిస్ట్రేషన్ వెంటనే చేస్తారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు 22-ఏ జాబితా భూములను క్షుణ్ణంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి సరైన జాబితాను రూపొందిస్తారని తెలిపారు. అందులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని, ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ భూ హక్కుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రైవేటు భూములకు సంబంధించి ఒక్క అంగుళం భూమికి కూడా ఇబ్బంది రానివ్వమని స్పష్టం చేశారు. 22-ఏ భూముల విషయంలో దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూచించారు. ఎలాంటి పుకార్లు, కట్టు కథలను విశ్వసించవద్దని కోరారు.

**తప్పును సరిదిద్దుతున్నాం : పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ఇది పేదల ప్రభుత్వం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ వివరాలు 2లో..

## 2027 అసెంబ్లీ ఎన్నికల వేళ యూపీ, పంజాబ్, గుజరాత్‌కు బీజేపీ ఇన్‌ఛార్జ్‌లు

- పంజాబ్ బాధ్యతలు సతీశ్ పూనియాకు
- గుజరాత్ ఇన్‌ఛార్జ్‌గా తరుణ్ చుగ్
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ కీలక నియామకాలు



## రైతుల అవసరాలకు అనుగుణంగా ఉద్యాన పరిశోధనలు

- పరిశోధన ఫలితాలు రైతుల చెంతకు చేరేలా ఆధునిక సాంకేతికతను వినియోగించాలి
- చిన్న, సన్నకారు రైతులే లక్ష్యంగా పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- రాష్ట్రంలో కూరగాయల ఉత్పత్తి పెంపునకు ప్రత్యేక కార్యాచరణ అవసరం
- మూడు నాలుగేళ్లలో తెలంగాణలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్‌పామ్ విస్తరణ లక్ష్యం
- శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి తుమ్మల




హైదరాబాద్

రైతుల అవసరాలకు అనుగుణంగా ఉద్యాన పరిశోధనలు జరగాలని, శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాల్లో జరుగుతున్న పరిశోధనల ఫలితాలు రైతుల చెంతకు చేరేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్ కు మంత్రి శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యాన రంగానికి కొత్త దిశను చూపే చారిత్రాత్మక ఘట్టంగా వివరాలు 2లో..

# రైతుల అవసరాలకు అనుగుణంగా ఉద్యాన పరిశోధనలు

-మొదటిపేజీ తరువాయి

ఈ పరిశోధనా సముదాయం నిలుస్తుందని అన్నారు. ఇప్పటివరకు విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు, ప్రయోగశాలల్లో ఎన్నో విలువైన పరిశోధనలు జరిగినప్పటికీ వాటి ఫలితాలు రైతులకు ఆశించిన స్థాయిలో చేరడం లేదని మంత్రి అన్నారు. గతంలో పరిశోధన ఫలితాలను రైతులకు చేరవేయడానికి రేడియో, టెలివిజన్ వంటి పరిమిత మార్గాలు ఉండేవని, ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియా, యూట్యూబ్ వంటి శక్తివంతమైన మాధ్యమాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పరిశోధనల ఫలితాలను వీడియోలు, షార్ట్ ఫిల్మ్‌లు, సోషల్ మీడియా ద్వారా రైతులకు చేరేలా శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయాలు, ఉద్యాన శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ భూమిలో ఉద్యాన పంటలు సుమారు 6 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, వ్యవసాయ స్థూల విలువలో వాటి వాటా 26 శాతం, సుమారు రూ.30,346 కోట్లుగా ఉందని తెలిపారు. ఉద్యాన రంగం రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నందున పరిశోధన, సాంకేతికత, విస్తరణ సేవలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కూరగాయల ఉత్పత్తిలో సుమారు 70 శాతం లోటు ఉందని, ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండటం ఆందోళనకరమని మంత్రి అన్నారు. రాష్ట్రంలోనే డిమాండ్ ఉన్న కూరగాయలు, ఉద్యాన పంటలను పండించేలా ప్రతి జిల్లా, మండల కేంద్రాల్లో డెమాన్‌స్ట్రేషన్ ప్లాట్లను ఏర్పాటు చేయాలని కోరారు. రైతులు ప్రత్యక్షంగా పంటలను, దిగుబడులను, ఆదాయ అవకాశాలను చూసి నేర్చుకునేలా ఫీల్డ్ డెమాన్‌స్ట్రేషన్లు నిర్వహిస్తే ఉద్యాన పంటల విస్తీర్ణం, ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. చిన్న, సన్నకారు రైతుల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు జరగాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సుమారు 70 లక్షల మంది రైతుల్లో దాదాపు 90 శాతం మంది చిన్న రైతులేనని, రెండు మూడు ఎకరాల భూమి కలిగిన రైతులు ఖరీదైన యంత్రాలు లేదా భారీ పెట్టుబడులతో కూడిన సాంకేతికతను స్వయంగా స్వీకరించలేరని అన్నారు. అందువల్ల తక్కువ ఖర్చుతో, చిన్న కమతాల్లో అమలు చేయగల సాంకేతికత, యంత్రాలు, సాగు పద్ధతులపై పరిశోధనలు జరగాలని సూచించారు. రైతుల జీవితాల్లో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలు చూపేలా గ్రామీణ యువతలో ఉన్న సృజనాత్మకతను కూడా ప్రోత్సహించాలని మంత్రి అన్నారు. వ్యవసాయ కుటుంబాలకు చెందిన యువత తమ తల్లిదండ్రుల కష్టాలను తగ్గించేందుకు స్వయంగా యంత్రాలు, పరికరాలను రూపొందిస్తున్నారని, ఇలాంటి ఆవిష్కరణలను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఇప్పటికే ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో దేశంలోనే ముందంజలో ఉందని మంత్రి తెలిపారు. రానున్న మూడు నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు తీసుకెళ్లే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఆయిల్‌పామ్‌తో పాటు కోకో, జాపత్రి తదితర అంతర పంటల ద్వారా రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు




కల్పించవచ్చని అన్నారు. రైతులు ప్రత్యక్షంగా చూసి నేర్చుకునేలా ఈ పద్ధతులను పరిశోధనా కేంద్రాలు, డెమాన్‌స్ట్రేషన్ ఫారాల్లో ప్రదర్శించాలని సూచించారు. ఉద్యాన పరిశోధనలను కేవలం ప్రయోగశాలలకే పరిమితం చేయకుండా రైతుల పొలాల్లోకి తీసుకెళ్లాలని మంత్రి అన్నారు. కూరగాయలు, పూలు, ద్రాక్ష, ఔషధ, సుగంధ పంటలపై పరిశోధనలను ఒకే గొడుగు కింద సమన్వయం చేసేందుకు హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం కీలకమైన ముందడుగు అని తెలిపారు. ఉద్యాన పంటల్లో ఉత్పత్తి పెంచడంతో పాటు పంట అనంతర నష్టాలను తగ్గించడంపైనా పరిశోధనలు అవసరమని మంత్రి చెప్పారు. పంట చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోవడం లేదా ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోకుండా పంట అనంతర నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు అధికంగా రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా శాస్త్రీయ సూచనల మేరకు సమతుల్య ఎరువుల వినియోగం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించేలా పరిశోధనా సంస్థలు, వ్యవసాయ శాఖ అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. పంటల్లో రసాయన అవశేషాలను తగ్గించి నాణ్యమైన ఉత్పత్తులను అందించగలిగితే దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో కూడా తెలంగాణ పంటలకు మరింత డిమాండ్ ఏర్పడుతుందని అన్నారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే ఆధునిక సాగు పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని మంత్రి అన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు విధానాలు భవిష్యత్ వ్యవసాయానికి ఎంతో అవసరమని, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించే పద్ధతులను పరిశోధించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాల్లో కూడా తమ కార్యకలాపాలను విస్తరించాలని మంత్రి కోరారు. ప్రభుత్వానికి చెందిన సీడ్ ఫారాలు, ఇతర అందుబాటులో ఉన్న భూములను వినియోగించుకొని జిల్లాల వారీగా పరిశోధన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. రైతులు తమ ప్రాంతంలోనే కొత్త పంటలు, ఆధునిక సాగు పద్ధతులను ప్రత్యక్షంగా చూసి స్వీకరించే అవకాశం కల్పించాలని అన్నారు.

వ్యవసాయమే భవిష్యత్తు అని మంత్రి పేర్కొన్నారు. కరోనా సమయంలో అన్ని రంగాలు దాదాపు నిలిచిపోయినా రైతు వ్యవసాయాన్ని మాత్రం ఆపలేదని గుర్తుచేశారు. భవిష్యత్ తరాలకు వ్యవసాయాన్ని మరింత ఆకర్షణీయమైన, లాభదాయకమైన వృత్తిగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, పట్టు పరిశ్రమ తదితర అనుబంధ రంగాలన్నీ రైతు కేంద్రంగా పనిచేయాలని, రైతు కష్టాన్ని ఎలా తగ్గించాలి, ఆదాయాన్ని ఎలా పెంచాలి అనే దృక్పథంతో పరిశోధనలు, విధానాలు రూపొందించాలని పిలుపునిచ్చారు.

రైతులకు నాణ్యమైన విత్తనాల సమస్యను పరిష్కరించేందుకు విత్తన ప్రాసెసింగ్ యూనిట్, మహిళా రైతులు, గ్రామీణ యువతకు శిక్షణతో పాటు కొత్త వ్యాపార అవకాశాలను కల్పించేందుకు మష్రూమ్ ఉత్పత్తి యూనిట్ వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు.

ప్రతి మూడు సంవత్సరాలకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని పరిశోధనా ఫలితాలను క్షేత్రస్థాయిలో అమలు చేసే విధంగా యూనివర్సిటీ, పరిశోధనా కేంద్రాలు, వ్యవసాయ?ఉద్యాన శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి సూచించారు.

# సంక్షేమ పథకాలపై క్రెడిట్ వార్



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ప్రచార ఆధిపత్యం సరికొత్త మలుపు తిరిగింది. సంక్షేమ పథకాల క్రెడిట్ ఎవరిదనే అంశంపై అధికార కాంగ్రెస్, విపక్ష బీజేపీ మధ్య మొదలైన వాగ్వాదం ఇప్పుడు 'ఫోటోల వార్'గా మారింది. సంక్షేమ పథకాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో ముద్రించాలని బీజేపీ పట్టుబడుతుండగా, కేంద్ర పథకాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో ఎందుకు పెట్టకూడదని కాంగ్రెస్ ఎదురుదాడికి దిగిందితెలంగాణలో కొత్తగా జారీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోను పక్కనపెట్టి సీఎం, మంత్రుల ఫోటోలు ఎలా ముద్రిస్తారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.తెలంగాణలో 57 లక్షల రేషన్ కార్డుల ద్వారా దాదాపు 2 కోట్ల మంది ప్రజలకు కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం అందిస్తోందని, అలాంటప్పుడు ఆ పథకానికి సంబంధించిన కార్డులపై మోదీ చిత్రం ఎందుకు ఉండకూడదని నిలదీశారు. గత 12 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం రూ.13 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, అదనంగా బుల్లెట్ రైన్ కారిడార్ కోసం మరో రూ.1.5 లక్షల కోట్లు వెచ్చించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి కేంద్రం నిధులిస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాటకాలాడుతూ క్రెడిట్ కొట్టేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను విస్మరిస్తూ '22ఏ నిషేధిత భూముల జాబితా' పేరిట గత రెండేళ్లుగా దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు.బండి సంజయ్ వ్యాఖ్యలకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా ఆదాయం వెళ్తోందని స్పష్టం చేశారు. జీఎస్టీతో పాటు ఇతర మార్గాల ద్వారా రాష్ట్రం నుంచి కేంద్ర ప్రభుత్వానికి భారీ మొత్తంలో పన్నుల రాబడి అందుతోందని, అందువల్ల రాష్ట్రంలో అమలయ్యే కేంద్ర పథకాలన్నింటిపై సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రానికి రాష్ట్రం చెల్లిస్తున్న పన్నులు ఎంత? తిరిగి కేంద్రం నుంచి రాష్ట్రానికి కేటాయిస్తున్న నిధులు ఎంత? అనే అంశంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో బలంగా ఉందని, తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వం ఎవరిదో బండి సంజయ్ తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పోటీకి నిలబడే సత్తా బీజేపీకి ఉందా అని ప్రశ్నించారు.తెలంగాణలో మొదలైన ఈ వివాదం కేవలం ఒక ఫోటోకు సంబంధించినది మాత్రమే కాదు.. సంక్షేమ పథకాల అమలులో ఓటర్లను ఆకట్టుకునేందుకు జరుగుతున్న రాజకీయ పోరాటం. ఉచిత బియ్యం కేటాయింపులు తమవేనని కేంద్రం చెబుతుంటే, రాష్ట్రానికి రావాల్సిన న్యాయబద్ధమైన నిధులను ప్రస్తావిస్తూ ఫెడరల్ హక్కుల కార్డును కాంగ్రెస్ ముందుకు తెస్తోంది. కార్డులపై, పోస్టర్లపై ఫోటోల ప్రాధాన్యత ఎవరు దక్కించుకుంటారనే అంశం రాబోయే రోజుల్లో ఇరు పార్టీల మధ్య మరింత రాజకీయ వేడిని పెంచే అవకాశం ఉంది.

## డిజిటల్ ఓ వైపు... ఫీల్డ్ లో మరో వైపు

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ యుద్ధం ప్రస్తుతం రెండు పారలర్ ఫీల్డ్స్‌లో జరుగుతోంది. ఒకవైపు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను, సోషల్ మీడియా సామ్రాజ్యాన్ని బీఆర్ఎస్ ముట్టడిస్తుంటే.. మరోవైపు క్షేత్రస్థాయి మాస్ రాజకీయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తన గుప్పిట్లో ఉంచుకుంటోంది. ఈ రెండు ఫీల్డుల్లో తమకు బలం ఉన్న ఫీల్డుల్లోనే రెండు పార్టీలు పోరాటాలు చేస్తున్నాయి కానీ మరో ఫీల్డులోకి వెళ్లేందుకు ఆసక్తి చూపించడం లేదు.కేటీఆర్ నిర్వహించే విలేకరుల సమావేశాలు మినహా బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష ఆందోళనలకు దూరంగా ఉంటున్నప్పటికీ, సోషల్ మీడియా వేదికగా విపరీతమైన కంటెంట్‌తో సంచలనం సృష్టిస్తోంది. యూట్యూబ్ ఛానళ్లు, ట్విట్టర్ , ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్స్ , ఇన్ఫ్లుయెన్సర్ల నెట్‌వర్క్ ద్వారా డిజిటల్ నెట్‌వర్క్‌ను సద్వినియోగం చేసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంతరం వ్యతిరేకతను ప్రచారం చేయడంలో బీఆర్ఎస్ శ్రేణులు ముందంజలో ఉన్నాయి.దీనికి పూర్తి భిన్నంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహం సాగుతోంది. డిజిటల్ స్పేస్ కంటే ప్రజల మధ్య ప్రత్యక్షంగా ఉండే సభలకే ఆయన ప్రాధాన్యతనిస్తున్నారు. వారంలో రెండు మూడు బహిరంగ సభలు లేదా ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొంటూ నేరుగా ప్రజా బాహుళ్యంలోకి వెళ్తున్నారు. రేవంత్ ప్రసంగాలు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, పొలిటికల్ మాస్ డైలాగ్‌లు, వైరల్ స్టేట్‌మెంట్లతో బీఆర్ఎస్‌ను ఎండగట్టేలా ఉంటున్నాయి.

## మళ్లీ వచ్చేది మనమే

-మొదటిపేజీ తరువాయి

సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. గౌడ, యాదవ, ముదిరాజ్, దళిత వర్గాలను ప్రోత్సహించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అర్హులైన నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం నిత్యం స్ఫూర్తి నింపేలా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలన్నారు. 2029లో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమావ్యక్తం చేశారు. నేత, గీత కార్మికులకు పింఛన్ ఇవ్వాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వ పొలాలు ఎక్కడున్నా ఈత, తాటిచెట్లు పెంచాలని రేవంత్ రెడ్డి సూచించారు. వాటిని పెంచితే కల్తీ లేని కల్లు వస్తుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, కాలువ గట్ల వెంబడి నాటాలన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం

కులవృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ చదివించాలని తల్లిదండ్రులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుటుంబ న్యాయం మాత్రమే జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని సీఎం తెలిపారు. బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న కేటీఆర్, హరీశ్?రావు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. రాష్ట్రంలో కరవు రావాలని కోరుకుంటూ అఘోరాలతో చేతబడులు చేయించారని ఆరోపించారు. పాత దొరల పాలన మళ్లీ రావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని ప్రజలను కోరారు. "ప్రజాపాలనలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు ఉన్నాయి. సర్వాయి పాపన్న విగ్రహం పెట్టాలని గీత కార్మికులు కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు స్థలాన్ని నేనే సూచించాను. ఇక్కడ టూరిజం కార్యాలయం ఉండేది. విగ్రహం కోసం ఖాళీ చేయించా. ట్యాంక్‌బండ్‌కు ఎవరొచ్చినా, సర్వాయి పాపన్న విగ్రహం కనపడేలా స్థలం ఎంపిక చేశాను. దేశవిదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు కనపడేలా విగ్రహం ఏర్పాటు చేశాం. బహుజనుల నుంచే పుట్టుకొచ్చిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్'

### మరోసారి అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్‌నే

గత బీఆర్ఎస్ పాలనపై సీఎం రేవంత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నాడు గొర్రెలు, బర్రెలు, చేపలు పంపిణీ చేసి రాజ్యం వాళ్లు ఏలుతూ, మనల్ని కుల వృత్తులకే పరిమితం చేయాలని చూశారు' అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సీఎం అయితే ఆయన కొడుకు కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్, అల్లుడు హరీశ్ రావు మంత్రి అయ్యారని.. అదే రేవంత్ సీఎం అయితే బీసీ నేత మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్, సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనుమరాలికి కీలక పదవులు ఇచ్చి ఉద్యమకారులను గౌరవించామని తెలిపారు. రాబోయే డీలిమిటేషన్ తర్వాత 117 సీట్లతో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## మధ్యవర్తులను ఆశ్రయించొద్దు

-మొదటిపేజీ తరువాయి



ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ పేదవాడికి అన్యాయం చేయదని . పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా ఈ ప్రభుత్వం తీసుకోదని వారి హక్కులు, ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రిమాట్లాడారు. 22ఏ నిషేధిత జాబితా వల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరోమారు స్పష్టం చేస్తూ సమస్య పరిష్కార ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని 24 గంటల్లోనే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4 మొత్తం 34 రిజిస్ట్రేషన్లు జరిగాయని మంత్రి గారు వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 22ఏ నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతోందని తెలిపారు.

బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా పొరపాటును పారదర్శకంగా అంగీకరించి . అదే సమయంలో జరిగిన తప్పును సరిదిద్దే బాధ్యతను కూడా తీసుకున్నామని ప్రజలను ఇబ్బందుల్లో వదిలేసే ప్రభుత్వం తమది కాదని స్పష్టం చేశారు. వివిధ జీవోలు, మెమోల ద్వారా గత ప్రభుత్వాల కాలంలో క్రమబద్ధీకరించబడిన ప్రైవేట్ భూములు, హైకోర్టు మరియు జీహెచ్ఎంసీ/హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు ఆన్‌లైన్ అప్‌లోడింగ్‌లో సాంకేతిక లోపం కారణంగా 22ఏ జాబితాలోకి వచ్చాయని మంత్రి వివరించారు.ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే గుర్తించిందని, బాధితులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించామని తెలిపారు.

22ఏ సమస్యల త్వరిత పరిష్కారం కోసం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ రోజువారీగా దరఖాస్తులను పరిశీలించి . జెన్యూన్ ప్రైవేట్ ఆస్తులన్నింటినీ తక్షణమే క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పుడు పేదవాడి సమస్యను రాజకీయంగా వాడుకోవడం మానేయండి. ఇది పేదల ప్రభుత్వం.. పేదల ఆశీస్సులతో వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం. పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా అన్యాయం జరగనివ్వం. మేం తప్పును ఒప్పుకుని దిద్దుతున్నాం.. మీరు చేసిన తప్పులను ఒప్పుకునే ధైర్యం మీకుందా?" అని ప్రశ్నించారు. అబద్ధాలు, ఆరోపణలు, రాజకీయ ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు. తప్పు జరిగితే దాన్ని అధికారుల మీదకు నెట్టేసి చేతులు దులుపుకోవడం తమ ప్రభుత్వ విధానం కాదని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పొరపాటును అంగీకరించామన్నారు

## ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది



-మొదటిపేజీ తరువాయి

సాకుగా చూపుతూ పౌరుల ఓటు హక్కును నిరాకరించడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎలాంటి పక్కా కారణాలు లేకుండా సుమారు 73 లక్షల ఓట్లను తొలగించారని, మరో 92 లక్షల ఓట్లను అనుమానిత జాబితాలో చేర్చారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల మార్పుల వల్ల తలెత్తిన సాంకేతిక సమస్యలు ఈ గందరగోళానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీల తరహాలోనే ఎన్నికల సంఘాన్ని కూడా తన 'పాకెట్ సంస్థ'గా మార్చుకుందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## అక్కినాపురం తండాలో తప్పిన పెను ప్రమాదం




సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహా । ఆగస్టు 18 2026: ఏన్కూరు మండలం అక్కినాపురం తండాలో మంగళవారం పెను ప్రమాదం తప్పింది. కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు బూడిద లోడుతో వెళ్తున్న లారీ టాంకర్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న వరి పొలంలో బోల్తా పడింది. లారీ కట్ట విరిగిపోవడంతో వాహనం అదుపు తప్పినట్లు స్థానికులు తెలిపారు.

బూడిద లోడుతో లారీ వేగంగా వెళ్తుండగా ఒక్కసారిగా కట్ట విరిగిపోవడంతో డ్రైవర్ వాహనాన్ని అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. లారీ రహదారి పక్కకు దూసుకెళ్లి వరి పొలంలోకి వెళ్లి బోల్తా పడింది. భారీ లోడుతో ఉన్న లారీ ఒక్కసారిగా పొలంలో పడిపోవడంతో పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

ప్రమాదం జరిగిన సమయంలో లారీ పొలంలోకి వెళ్లడంతో రహదారిపై వెళ్తున్న ఇతర వాహనాలకు, స్థానికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. లారీ డ్రైవర్ సైతం ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాదం విషయం తెలుసుకున్న స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని పరిశీలించారు. పొలంలో బోల్తా పడిన లారీ నుంచి బూడిద బయటకు పడిపోవడంతో కొంతసేపు అక్కడ పరిస్థితి ఆందోళనకరంగా కనిపించింది. ప్రమాదానికి గురైన లారీని బయటకు తీసేందుకు చర్యలు చేపట్టాల్సి వచ్చింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

## సామ్రాజ్యవాద నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన బహుజన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్

- ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి
- ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు
- ఘన నివాళులర్పించిన ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి
- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్ మరియు గౌడ సంఘం నేతలు



షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి ఆగస్టు 18: రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం తెలంగాణ బహుజన వీరుడు, సామ్రాజ్యవాద నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ సామాన్య కల్లుగీత కార్మిక కుటుంబంలో జన్మించి,మొఘల్ సామ్రాజ్య పునాదులను కదిలించిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని,నిరంకుశ భూస్వామ్య పోకడలపై తిరుగుబాటు చేసి,గోల్కొండ కోటపై బహుజన జెండాను ఎగురవేసిన ధీరుడని,అణచివేతకు గురైన వర్గాలను ఏకం చేసి,సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన సామాజిక విప్లవకారుడిగా ఆయన చరిత్రలో నిలిచారని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,కౌన్సిలర్ అనితరఘునాథ్ యాదవ్,వాణి పాండురంగ రెడ్డి,గౌస్ జానీ,మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్,కానుగు అనంతయ్య,చింటు ప్రతాప్ రెడ్డి,చిన్న యాదగిర,జూపల్లి శంకర్,
సర్పంచ్ సులోచన గణేష్ గౌడ్,మాజీ సర్పంచ్ రంగయ్య గౌడ్,నక్కల వెంకటేష్ గౌడ్,అంజయ్య గౌడ్,రాఘవేందర్ గౌడ్,శ్రీకాంత్ గౌడ్,రజినీ కాంత్ గౌడ్,జయరాం గౌడ్,నర్సిమా గౌడ్,రవీందర్ గౌడ్,గోపాల్ గౌడ్,మహేష్ గౌడ్,అభి గౌడ్,ఉదయ్ గౌడ్,సురేష్ గౌడ్, శ్రీధర్ గౌడ్,మరియు గౌడ్ సంగమ్ నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు

## యాంటీ ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి..

- ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హవీలా...




సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ప్రతినిధి, ఆగస్టు 18,విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని, ర్యాగింగ్‌కు పాల్పడి తోటి విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగించవద్దని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హవీలా సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులు శిక్షార్హులని ఆమె స్పష్టం చేశారు.

మంగళవారం భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి విభాగంలో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ హవీలా మాట్లాడుతూ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ, సెల్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎవరైనా విద్యార్థి ర్యాగింగ్‌కు గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని, యాంటీ ర్యాగింగ్ సెల్ ద్వారా కౌన్సెలింగ్ అందిస్తామని చెప్పారు.

సీనియర్ విద్యార్థులు కళాశాలకు వచ్చే జూనియర్లతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, ప్రేమానురాగాలతో కలిసి చదువుకోవాలని సూచించారు.

ఎస్సై స్వప్న మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే ప్రాధాన్యం ఇవ్వాలని, ఇతరులను ర్యాగింగ్ చేయవద్దని సూచించారు. అనవసర విషయాల్లో జోక్యం చేసుకుని సమస్యలను పోలీస్ స్టేషన్ వరకు తీసుకురావద్దని హితవు పలికారు. విద్యార్థినులు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా కళాశాలలోని ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్‌ను సంప్రదించి సూచనలు, సహాయం పొందాలని తెలిపారు.

కార్యక్రమంలో ఎస్సై రాంబాబు, డాక్టర్ రాగ సుమ, డాక్టర్ నాగ సమీరా, సుధాకర్, రమేష్, పూర్ణిమతో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

- ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలు
- ఘన నివాళులర్పించిన షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడి
- షాద్నగర్ గౌడ సంఘం సంఘ అధ్యక్షులు సంఘ సభ్యులు



షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి ఆగస్టు 18:రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు షాద్నగర్ లో ఘనంగా నిర్వహించారు ఎమ్మెల్యే వీర్ల శంకర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల నుండి ఎదిగి వారిని పోరాట శక్తిగా మలుచుకొని తెలంగాణ నేలపై స్వయ పాలనకు పునాదిగా వేసిన అసాధారణ ప్రజా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సుమారు మూడున్నర శతాబ్దాల క్రితమే సామాజిక సమానుతలు దోపిడి ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడిన పాపన్న ఒక వ్యక్తి మాత్రమే కాదు ఒక చరిత్రక తిరుగుబాటు సామాన్యుడి నుంచి నాయకుడిగా యోధుడుగా పాలకుడుగా ఎదిగిన తన కాలములోని అధికార వ్యవస్థలను సవాలు చేసిన ప్రజా వీరుడు సర్వాయి పాపన్న తనజీవితం తెలంగాణ సామాజిక చరిత్రలో ఒక ప్రత్యేక ఆయుధం సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన చిన్నతనం నుంచే గ్రామీణ సమాజంలో అసమనతులను ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను దోపిడీలను గమనించారు ఆ కాలంలో సామాజిక స్థాయి కులం వృత్తి ఆర్థిక పరిస్థితులు వ్యక్తి జీవితాన్ని నిర్ణయించి పరిస్థితులు ఉండేవి భూస్వాములు దేశముకులు జాగిర్దారులు వంటి స్థానిక అధికార కేంద్రాల ఆధిపత్యం సామాన్యులపై ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపేది ఈ పరిస్థితులను చూసిన పాపన్నలో తిరుగుబాటు భావం బలపడింది అయితే తన అసంతృప్తిని వ్యక్తిగత పోరాటానికి పరిమితం చేయలేదు . వివిధ సామాజిక వర్గాల ప్రజలను సమీకరించి ఒక శక్తివంతమైన ఉద్యమనే నిర్మించాడు చాకలి సర్వన్న మంగలి మాసన్న కుమ్మరి గోవిందు జక్కల పేరుమల్ దూదేకుల పిరు మీర్ సాహెబ్ వంటి వివిధ సామాజిక వర్గాలను చెందిన సహచరులు ఆయనతో కలిసి నడిచినట్లు చరిత్రక జానపద ప్రస్తావాలు ఉన్నాయి సమాజంలో వేరువేరు వర్గాలను విడదీయకుండా ఒకే లక్ష్యం కోసం ఐక్యం ఆయన నిర్మించిన పోరాటాల శక్తి అని కొనియాడారు ఈ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి కొత్తూరు మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్ గోవర్ధన్ గౌడ్ బాలరాజు గౌడ్ అన్నారం మాజీ సర్పంచ్ రాములు గౌడ్ కుమారస్వామి గౌడ్ లింగారం సురేష్ గౌడ్ గౌడ సంఘం నాయకులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సొనాల మండల కేంద్రంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

- తనిఖీలలో 232 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 2 కార్లు, స్వాధీనం
- ఇద్దరిపై ఎక్సైజ్ కేసులు నమోదు.
- 150 మంది పోలీసు సిబ్బందితో తెల్లవారుజామున విస్తృత తనిఖీలు
- నంబర్ ప్లేట్ లేని, ఫేక్ నంబర్ ప్లేట్ కలిగిన కార్ స్వాధీనం
- గంజాయి సేవించిన నిందితునిపై కేసు నమోదు.
- గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, మట్కా లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై హెచ్చరిక
- ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి, హెల్మెట్ ధరించాలి
- సిసిటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలి.
- స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి ఎన్ వెంకట నరసయ్య



జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం, నేరాల నియంత్రణ, ప్రజలతో పోలీసుల అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా మంగళవారం సోనాల మండల కేంద్రంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ ఆదేశాలు మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని తెల్లవారుజామున నుండి నిర్వహించినట్లు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి ఎన్ వెంకట నరసయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 5 గంటల నుంచే సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 232 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 2 కార్లు, స్వాధీనం చేసుకున్నారు. ఫేక్ నెంబర్ ప్లేట్లు అమర్చిన ఒక కారును స్వాధీనం చేసుకొని, (దీచీా) సెక్షన్ 318(4) ప్రకారం చీటింగ్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతం లో ప్రభుత్వ రాయితీ (ఞఆ) బియ్యాన్ని కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, విక్రయించడం లేదా అక్రమంగా తరలించడం నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే జిల్లాలో రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకొని చట్టాన్ని గౌరవించేలా జీవించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, గంజాయి సేవించడం, నిల్వ ఉంచడం, రవాణా చేయడం, సరఫరా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సేవిస్తున్న ఒక నిందితునిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యత తెలియజేస్తూ కాలనీ మొత్తం కలిసికట్టుగా సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ప్రత్యేక తనిఖీల్లో భాగంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి నిందితుల వద్ద మద్యం బాటిళ్ల ను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని తెలిపారు, నిబంధనలు ఉల్లంఘించిన కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ డి ఎస్ పి కమతం ఇంద్ర వర్ధన్, సిఐలు సిహెచ్ రమేష్, బి ప్రణయ్ కుమార్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి వెంకటి, టి. మురళి, ఎన్ చంద్రశేఖర్, ఎస్సైలు వి పురుషోత్తం, రమేష్, పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గౌతమ్‌పూర్‌లో బీఎల్ఓలకు ఘన సన్మానం...

ఓటర్ల సవరణ కార్యక్రమం విజయవంతంలో బీఎల్ఓల సేవలు అభినందనీయం...



సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18,చుంచుపల్లి మండలం గౌతమ్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఓటు హక్కు నమోదు అధికారులు (బీఎల్ఓలు) పద్మ, ఈశ్వరి, శివలీల, మస్తాన్‌లను ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎన్నికల సంఘం నిర్వహించిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా బాధ్యతాయుతంగా పూర్తి చేసినందుకు ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ సపావత్ కళ్యాణి, ఉపసర్పంచ్ గంగారం, పంచాయతీ కార్యదర్శి షర్మిల బీఎల్ఓలకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శులను బీఎల్ఓలు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు కలిసి సన్మానించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ కళ్యాణి, ఇతర ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో బీఎల్ఓల సేవలు కీలకమని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో అర్హులైన పౌరులందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా బీఎల్ఓలు నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో ఓటర్ల సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎర్ర ప్రియాంక, శిల్ప, కేత రాధ, ఈశ్లావత్ కాంతమ్మ, సపావత్ సురేష్, గ్రామ పెద్ద సొప్పరి క్రాంతి, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మా భూమి మాకు ఇప్పించండి అధికారులకు మొరపెట్టుకుంటున్న సాయి పేట గ్రామ నివాసులు సోంపల్లి రాజయ్య, శంకరయ్య.



, సికే న్యూస్ ఆగస్టు 18 మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్
, స్థానిక గ్రామం సాయి పేట సోంపల్లి సురేష్ ,శంకరయ్య పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు వీరు మాట్లాడుతూ మా నాన్న రాజయ్య, మా చిన్నాన్న శంకరయ్య పేరుమీద 30 గుంటల భూమి ఎల్కుర్తి గ్రామ శివారులో ఉంది 1978 సంవత్సరంలో గవర్నమెంట్ అసైన్డ్ భూమిని మాకు ఇచ్చినారు .ఆ భూమి సర్వే నెంబర్ 160/103 సోంపల్లి రాజయ్యకు 15 గుంటలు,సోంపల్లి శంకరయ్యకు 15 గుంటలు ప్రభుత్వం వారు ఇచ్చినారు.అప్పటినుండి ఇప్పటి2024 వరకు సాగు చేసినాము.మా అమ్మానాన్న చనిపోవడంతో ,మేము హైదరాబాద్, వరంగల్ పట్టణాలకు వలస వెళ్లి పని చేసుకుని మా కుటుంబాలను పోషించుకుంటున్నాం .2025 26 సంవత్సరం నుండి మేము ఆ భూమిని సాగు చేయలేదు, మేము అటువైపు వెళ్ళలేకపోవడంతో మా భూమిలో మాకు తెలవని వ్యక్తులు ఫినిషింగ్ వైరు చుట్టి పూల తోటలు పెట్టినారు.ఎవరు దీన్ని ఆక్రమించినారు అని తెలుసుకొని వారిని అడగగా వారు ఏలుకుర్తి గ్రామానికి చెందిన దుందుల లింగాచారి, వరదాచారి అన్నదమ్ములు అని తెలుసుకున్నాం. వారికి ఫోన్ చేసి అడగగా వారు మేము ఈ భూమిని కొన్నాము.మాకు అమ్మిన వారు నర్సింగరావుపల్లి ప్రజాప్రతినిధి గ్రామ సర్పంచ్ యాద శోభారాణి, భర్త యాద కుమారస్వామి మాకు అమ్మినారు అని తెలియపరిచినారు.భూమి అమ్మిన వారి దగ్గరకు వెళ్లి మేము అడగగా వారు సరి అయిన సమాధానం ఇవ్వలేక పోయారు .సోంపల్లి రాజయ్య శంకరయ్య కుటుంబ సభ్యులందరూ పోలీస్ స్టేషన్కు వెళ్ళినాము.మా భూమి మాకు ఇప్పించండి అని దిలీప్ ఎస్సైని కలిసినాం , ఒరిజినల్ కాగితాలు కలిగిన మేము ఎస్ఐకి చూపించినాము.ఇది మాభూమి మా వద్ద ఒరిజినల్ భూమి కాగితాలు ఉన్నాయి అని ఆర్డిఓ కి, అట్లే హనుమకొండ గ్రీవెన్స్ సెల్ లో కూడా కంప్లైంట్ వారి మీద ఇచ్చినాము.తదుపరి హనుమకొండ కలెక్టర్ చాహత్ వాజ్పేయి కి మా భూమి ఒరిజినల్ కాగితాలు చూపెట్టినాము, వాటిని చూసి కలెక్టర్ మీరు వెళ్లి మీ భూమిని స్వాధీనం చేసుకోండి మీకు ఏమైనా పోలీస్ ప్రొడక్షన్ తీసు కొండి నేను పంపిస్తాను అన్నారు.1978 సంవత్సరం నుండి 2026 వరకు పహానిలో సోంపల్లి రాజయ్య, సోంపల్లి శంకరయ్య ఉన్నాము. మా పేర్ల మీదనే ఈ భూమి చూపెడుతుంది.మా మీద దయ తలచి మా రెండు కుటుంబాలకు సహాయం చేయమని ప్రభుత్వ అధికారులను, ప్రజాప్రతినిధులను, పత్రికా విలేకరులను వేడుకుంటున్నాం.నర్సింగరావుపల్లి సర్పంచ్ యాద శోభ రాణిని వెంటనే పదవి నుండి తొలగించాలి. బాధితులమైన మా కుటుంబాలకు న్యాయం చేయాలని అన్నారు.

# కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ పథకాన్ని కొనసాగించాల్సిందే



అదిలాబాద్ జిల్లా సికె ప్రతినిధి
బోత్ నియోజకవర్గం//ఇచ్చోడా మండలంకేంద్రం.లి
తులం బంగారం ఇవ్వాల్సిందే
కెసిఆర్ గారి ప్రభుత్వం లో 15 లక్షల మందికి పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక సహాయం అందింది.
14 లక్షల మంది ఆడబిడ్డలకు కెసిఆర్ కిట్టు అందించిన ఘనత కెసిఆర్ గారిది.
కెసిఆర్ గారి హయంలో రైతు భీమా పథకం 2018లో పథకం ప్రారంభమైనప్పటి నుంచి 2021 నాటికి 65,184 రైతు బీమా క్లెయిమ్‌లు పరిష్కరించబడ్డాయి బాధిత కుటుంబాలకు మొత్తం 3,259.3 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేశారు.!!
కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కళ్యాణ లక్ష్మీ ,షాది ముబారక్ పథకాన్ని నిలిపివేయడాన్ని నిరసిస్తూ దీ=ూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆదేశాలమేరకు నేడు ఇచ్చోడా మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా లో నిర్వహించిన ధర్నాలో గౌరవ బోత్ మీూా శ్రీ. అనిల్ జాదవ్ గారు నాయకులతో కలిసి నిరసన చేపట్టారు
ఈ సందర్భంగా మీూా అనిల్ జాదవ్ గారు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన వెంటేనే పేద కుటుంబాల్లో ఆడబిడ్డ వివాహం అంటే ఆర్థిక భారమో గుర్తించిన గౌ.కెసిఆర్ గారు 2014 అక్టోబర్ 02న కళ్యాణ లక్ష్మీ - షాది ముబారక్ పథకాన్ని ప్రారంభించారు.
ప్రారంభంలో 51 వేలుగా ఉన్న ఆర్థిక సహాయం తర్వాత 1,00,116కు పెంచారని ప్రభుత్వమే ఒక కుటుంబ సభ్యుడిగా భాగస్వామిగా నిలబడిందని కెసిఆర్ గారి హయాంలో సుమారు 15లక్షల మంది ఆడబిడ్డలకు కెసిఆర్ గారు మేనమామలా సహాయాన్ని అందించారు ఆడబిడ్డలకు గొప్ప వరంగా ఈ పథకం నిలిచిందనీ అన్నారు.
ఈ పథకానికి జాతీయ స్థాయిలో ప్రశంసలు సైతం లభించింది.
2023 ఎన్నికల సమయంలో కెసిఆర్ గారు కేవలం లక్ష మాత్రమే ఇస్తున్నారు కానీ ఇప్పుడు ఉన్న జూటా ముఖ్య మంత్రి రేవంతు గెలిచిన రోజు నుంచి లక్షతో పాటి తులం బంగారం కూడా ఇస్తానని ఆడబిడ్డలను నమ్మబలికి నేడు అధికారంలోకి వచ్చాక హామీని అమలు చేయకపోగా ఇప్పటికే అమలులో ఉన్న పథకాన్ని ప్రశ్నార్థకంగా మార్చేసిందు అని అన్నారు.కేసీఆర్ గారు ముందే రాష్ట్ర ప్రజలకు ముందే చెప్పారు కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలకు రామ్ రామ్ అని . ఈ విషయం ప్రజలకు ఇప్పుడు తెలిసిసోస్తున్నది కెసిఆర్ గారి ప్రభుత్వంలో నేల రోజుల్లో ఆర్థిక సహాయం అందితే ఈ రేవంత్ ప్రభుత్వంలో పెళ్ళి పిల్లలు పుట్టినా కూడా ఆర్థిక సహాయం అందడం లేదని అన్నారు.
కార్యాలయాల చుట్టూ తిరగలేక ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారనే విషయాన్ని గుర్తుచేశారు.
హైకోర్టులో గడువు లభించినప్పటికీ కౌంటర్ ఎందుకు వెయ్యలేదో ఈ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.
ముఖ్యమంత్రి,మంత్రులు లేదా ప్రభుత్వ కీలక కేసుల్లో ప్రైవేట్ న్యాయవాదుల సేవలు తీసుకునే ప్రభుత్వం పేద ఆడబిడ్డల హక్కులకు సంబంధించిన పథకం విషయంలో ఎందుకు సరిగ్గా స్పందించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు.
కావాలనే ఆలస్యం చేసి పథకాన్ని నిలిపివేయాలనే ఆలోచనను మానుకోవాలని పెండింగ్ లో ఉన్న అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఆలస్యం లేకుండా ఆర్థిక సహాయం విడుదల చెయ్యడంతో పాటు హైకోర్టు కేసులో ప్రభుత్వం తీసుకున్న చర్యలపై స్పష్టత ఇవ్వాలని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తులం బంగారం హామీని ఎప్పుడు,ఎలా అమలు చేస్తుందో స్పష్టమైన ప్రకటన చెయ్యాలని డిమాండ్ చేశారు.లేకపోతే బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు
అదేవిదంగా రైతు ల పాటిలిట కూడా శాపం గా మారిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని కొనసాగకుండా ప్రీమియం చెల్లించని ప్రభుత్వం నీ రైతులే బుద్ది చెప్పాలి.

# ప్రగతి మైదానం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి...

సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18,కోత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని నిరుద్యోగ యువత తరఫున మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్, ఎస్ఎస్‌సీ జీడీ, అగ్నివీర్, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, అస్సాం రైఫిల్స్ తదితర యూనిఫాం సర్వీసుల ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వందలాది మంది అభ్యర్థులకు ప్రగతి మైదానం ప్రధాన శిక్షణా వేదికగా ఉందని పేర్కొన్నారు. మైదానంలోని 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, 1,600 మీటర్ల ప్రాక్టీస్ ట్రాక్, లాంగ్‌జంప్, షాట్‌పుట్ ప్రాంతాలు పూర్తిగా దెబ్బతిని వినియోగానికి అనువుగా లేకుండా పోయాయని తెలిపారు. సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు.
భారీ వాహనాలు మైదానంలోకి తరచూ ప్రవేశించడం వల్ల ట్రాక్ మరింత దెబ్బతింటోందని, మద్యం సీసాలు, పగిలిన గాజు ముక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు తదితర చెత్తను మైదానంలో పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొదలు పెరిగిపోవడంతోపాటు చెత్త పేరుకుపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని, పాములు, ఇతర విషపూరిత జీవుల సంచారం పెరిగి అభ్యర్థుల భద్రతకు ముప్పుగా మారిందని



తెలిపారు.
దెబ్బతిన్న ట్రాక్, ప్రమాదకర పరిస్థితుల కారణంగా ఇప్పటికే పలువురు అభ్యర్థులు శిక్షణ సమయంలో గాయపడ్డారని, దీంతో వారి ఉద్యోగ సాధనకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు.
కోత్తగూడెం పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు అందుబాటులో ఉన్న ఏకైక చవకైన శిక్షణా మైదానం ప్రగతి మైదానమేనని, దీనిని ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం కేవలం మౌలిక వసతుల కల్పన మాత్రమే కాకుండా ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువత భవిష్యత్తులో పెట్టుబడి అని వారు పేర్కొన్నారు.

**తమ డిమాండ్లు:**
400 మీటర్ల, 1,600 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌లను పునరుద్ధరించి అభివృద్ధి చేయాలి.
ప్రమాణాలకు అనుగుణంగా లాంగ్‌జంప్, షాట్‌పుట్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలి.
చెత్త, మద్యం సీసాలు, పగిలిన గాజు ముక్కలు, పొదలు తదితర ప్రమాదకర వ్యర్థాలను పూర్తిగా తొలగించి పరిశుభ్రతను పాటించాలి.
భారీ వాహనాలు మైదానంలోకి ప్రవేశించకుండా శాశ్వత అడ్డుకట్టలు లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.
మైదానానికి నిరంతర నిర్వహణ, పారిశుద్ధ్యం, భద్రత కల్పించాలి.
ఈ సమస్యను అత్యవసర ప్రజా సమస్యగా పరిగణించి తక్షణమే చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ యువత ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. అధికారులు సత్వరమే స్పందిస్తే వందలాది మంది యువతకు ప్రయోజనం చేకూరడంతోపాటు శిక్షణ సమయంలో జరుగుతున్న ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

# నకిలీ పత్రాలతో ఆరు ప్లాట్లు విక్రయించి రూ.42 లక్షల మోసం




ఆదిలాబాద్ జిల్లా, సీకే న్యూస్ ప్రతినిధి
ఐదుగురిపై కేసు, ముగ్గురు నిందితుల అరెస్ట్..
మావల పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో భూ మోసం
మావల ఎస్‌హెచ్‌ఓ బి.డి. ప్రేమ్ కుమార్
నిందితుల వివరాలు:
1) టోకల బుచన్న ఏ భుచన్న(70) o/శీ లేట్ దేవన్న, కప్పర్ల గ్రామం, తాంసి మండలం, ఆదిలాబాద్.
2) బొల్లి రాజు ఏ బొల్లి రాజన్న(47) o/శీ చిన నానా బాపు, కప్పర్ల గ్రామం, తాంసి మండలం, ఆదిలాబాద్.
3) ఎనుగు నవీన్ కుమార్
(పరారీ)
4) ఎల్టి లక్ష్మణ్ రెడ్డి ఏ లచ్చా రెడ్డి (62) ూ/శీ ఎల్టి పెద్ద గంగారెడ్డి, రైతు, నివాసం: రాంపూర్ గ్రామం, ఆదిలాబాద్.
5) బాలే నర్సింలు
కప్పర్ల గ్రామం, తాంసి మండలం, ఆదిలాబాద్.
(పరారీ).
మావల పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో ఆరు ప్లాట్లను విక్రయించి రూ.42 లక్షలు మోసం చేసిన ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు మావల ఎస్‌హెచ్‌ఓ బి.డి. ప్రేమ్ కుమార్ తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.
పోలీసుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డుకు చెందిన బి. పుష్పలత అనే మహిళకు బట్టి సావర్గాం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 3/1లో 1.05 గుంటల భూమిలో ప్లాట్లు ఉన్నట్లు చూపించి, ప్లాట్ నంబర్లు 1, 2, 11, 12, 13, 24లను విక్రయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
2021 ఆగస్టు 9న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ద్వారా ప్లాట్లు కొనుగోలు చేసిన అనంతరం బాధితురాలు స్థలంలో హద్దులు ఏర్పాటు చేసేందుకు వెళ్లగా, ఆ ప్లాట్లు తనవి కావని స్థానికులు చెప్పడంతో అనుమానం వచ్చింది. దీంతో తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించగా సంబంధిత భూమిపై విక్రయదారుల పేర్లు లేకపోవడంతో నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో మోసం చేసినట్లు గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
ఆరు ప్లాట్లకు ఒక్కో ప్లాట్‌కు రూ.7 లక్షల చొప్పున మొత్తం రూ.42 లక్షలు చెల్లించినట్లు బాధితురాలు తెలిపింది. ఇందులో కొంత మొత్తాన్ని చెక్ ద్వారా, మిగిలిన మొత్తాన్ని నగదు రూపంలో చెల్లించినట్లు పేర్కొన్నారు.
అనంతరం మధ్యవర్తిగా వ్యవహరించిన ఎల్టి లక్ష్మణ్ రెడ్డి తన తప్పును అంగీకరించి డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి, రూ.18 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చినప్పటికీ రూ.5 లక్షలు మాత్రమే చెల్లించి మిగిలిన మొత్తాన్ని చెల్లించకుండా జాప్యం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
ఈ ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్ 399/2025, సెక్షన్ 420 ర/ష 34 ఖూజ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ూ1 టోకల బుచన్న ఏ భుచన్న, ూ2 బొల్లి రాజు ఏ బొల్లి రాజన్న, ూ4 ఎల్టి లక్ష్మణ్ రెడ్డి ఏ లచ్చా రెడ్డిలను 17.08.2026న అరెస్ట్ చేశారు. ూ3 ఎనుగు నవీన్ కుమార్, ూ5 బాలే నర్సింలు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.
ప్రజలు స్థిరాస్తుల కొనుగోలు సమయంలో సంబంధిత ప్రభుత్వ రికార్డులు, భూమి యాజమాన్య హక్కులు, రిజిస్ట్రేషన్ వివరాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే లావాదేవీలు జరపాలని పోలీసులు సూచించారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ జయంతి వేడుకలు



ఆగస్టు 18 (సీ కే న్యూస్) చేగుంట :చేగుంట మండల కేంద్రంలో గాంధీ స్టాచ్ వద్ద తెలంగాణ వీరుడు, సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ జయంతి వేడుకలను మండల గౌడ సంఘం నాయకులు, సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కర్ణాల్ పల్లి ఎల్లమ్మ గుడి వద్ద గౌడ సంఘం నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించి పాపన్న మహారాజ్ చేసిన త్యాగాలను, చూపిన పోరాట పటిమను స్మరించుకున్నారు. బహుజనుల ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి ఆదర్శనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులుగా విశేష సేవలందిస్తున్న వడియారం సర్పంచ్, పోలంపల్లి ఉపసర్పంచ్‌లను గౌడ సంఘం నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం హాజరైన సభ్యులకు, స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో బాలరాజు గౌడ్, కిషన్ గౌడ్,వడియారం సర్పంచ్ సాయికుమార్ గౌడ్,, సత్య గౌడ్, జూకంటి రాజా గౌడ్, గిరి గౌడ్, ఇందూర్ పూరియల్ నర్సిములు గౌడ్, మాదాస్ శ్రీనివాస్ గౌడ్, ఆనంద్ గౌడ్, నళిని గౌడ్,శశి గౌడ్, మురళి గౌడ్,పర్మగౌని శ్రీనివాస్ గౌడ్, పొలం పల్లి కిష్టాగౌడ్,యాదగౌడ్,తదితరులు పాల్గొన్నారు

# వ్యవసాయ కుంటను పరిశీలించిన అధికారులు.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో చింతల రామారావుకు చెందిన వ్యవసాయ కుంటను ఏపీవో కోటయ్య, టీఏ కృష్ణయ్య తదితర అధికారులు పరిశీలించారు. వ్యవసాయ కుంట నిర్మాణ పనుల పురోగతి, నాణ్యతను పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు.
రైతులకు సాగునీటి వసతి కల్పించడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు వ్యవసాయ కుంటలు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. కుంట నిర్మాణ పనులను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు.లి
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, గ్రామ కార్యదర్శి కొండపల్లి ఉమారాణి, మేట్ మడిపల్లి రామకృష్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది చాపలమడుగు సైదులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకద్ర రైతులకు 40 ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ



సీకే న్యూస్ ప్రతినిధి -- దేవరకద్ర
దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మండలం, మున్సిపాలిటీ పరిధిలోని రైతులకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) 40 ట్రాన్స్‌ఫార్మర్లు, ఏబీ స్విచ్‌లు, వైర్లు, పోల్స్ పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, విద్యుత్ సమస్యలు లేకుండా రైతులకు అవసరమైన సామగ్రిని అందిస్తున్నామని తెలిపారు. తక్కువ వర్షపాతం కారణంగా బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్న రైతుల అవసరాల దృష్ట్యా దేవరకద్ర నియోజకవర్గానికి 800 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయని చెప్పారు.
మొదటి విడతగా దేవరకద్ర మండలానికి 40 ట్రాన్స్‌ఫార్మర్లు అందించామని, మరో పది రోజుల్లో 60 ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేస్తామని వెల్లడించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో దశలవారీగా రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సామగ్రి అందిస్తామని తెలిపారు.
ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి 13 సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేసి పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటికే 500 ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు అందించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.
కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## ఎస్సై శ్రీకాంత్ రెడ్డికి పాత్రికేయుల సన్మానం.



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 18.** వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల ఎస్సై శ్రీకాంత్ రెడ్డిని పాత్రికేయులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో సీకే న్యూస్ రిపోర్టర్ జి. బాలరాజ్, ప్రజా ప్రతిభ రిపోర్టర్ కృష్ణస్వామి, వనజ అప్డేట్స్ రిపోర్టర్ పల్సం స్వామి గౌడ్ పాల్గొని ఎస్సై శ్రీకాంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## గురుకులాన్ని ఏటూరునాగారం తరలించడం పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఏఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడు :ఎట్టి విద్యాసాగర్

- ఉద్యమం చేస్తామని హెచ్చరిక
- ఏఐ యుగం లో కూడా అడవి బిడ్డలకు అందని నాణ్యమైన విద్య ...



**సికే న్యూస్ వాజేడు మండల ప్రతినిధి : షేక్ రహీమ్ :** వాజేడు మండల కేంద్రంలో ఏ ఎన్ ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షులు మోడెం నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా హాజరైన అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ వాజేడు వెంకటాపురం మండలాలు పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ ఒక్క గురుకుల కళాశాల కూడా లేదని ప్రభుత్వాలతో మొరపెట్టుకుంటే ఒక ట్రైబల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాల మంజూరు చేయడం జరిగినదని అన్నారు . కానీ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాలకు భవనాలు కట్టకుండా ప్రభుత్వం కాలయాపన చేసిందని సాగర్ ఆరోపించారు. ఈ ప్రభుత్వం ఆదివాసి పిల్లలకు విద్యను దూరం చేయాలనే కుట్రలో భాగంగానే జరిగిందని విమర్శించారు. ఐటీడీఏ పీవో ఏజెన్సీ విద్యను బలోపేతం చేసే దిశగా దృష్టి పెట్టక పోవడం కారణామగానే ఏటూరునాగారం గురుకులం తరలించారు అన్నారు. నేటి పాలక ప్రభుత్వం వాజేడు
మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గురుకుల కళాశాలను,విద్యార్థుల తల్లిదండ్రులతో మీటింగ్ ఏర్పాటు చేయకుండానే రాత్రికిరాత్రే పిల్లలను ఏటూరునాగారం తరలించడం జరిగినదని అన్నారు. దీనిని ఆదివాసి నవనిర్మాణ సేనా తీవ్రంగా ఖండిస్తోంది అన్నారు. గురుకుల కళాశాలను తిరిగి తీసుకు రావాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఏటూరునాగారం లో ఇప్పటికే అన్నిరకాల విద్యావస్థలు ఉన్నప్పటికీ ఈ రెండు మండలాలకు సంబందించి గురుకుల కళాశాలను తరలించడం పట్ల తీవ్ర అగ్రహాన్ని వ్యక్తం చేసారు. టెక్నాలజీ పెరిగి ప్రపంచం ఒక కుగ్రామం అయిందని, ఏఐ యుగం లో బ్రతుకుతున్న సమయంలో నాణ్యమైన విద్య కోసం వందల కిలోమీటర్లు వెళ్లాల్సి రావడం అన్యాయం అన్నారు. వేల కోట్ల గిరిజన సబ్ ప్లాన్ నిధులను వెచ్చించి నాలుగు ఏళ్ళు అవుతున్న పక్కా భవనం ఎందుకు కట్టలేదని అయన ప్రశ్నించారు. ఏజెన్సీ విద్య పైన నిజంగా ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే పక్కా భవనం కట్టేవారని అన్నారు.ఈ సమావేశంలో పాయం.విజయ్ కుమార్, తలడి ప్రసాద్ ,కణితి విజయ్ బొగ్గుల. దేవేందర్ పార్శిక. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు

## ప్రధాన రహదారులపై ఏర్పడిన రోడ్డు గుంటలను , పూడ్చి మరమ్మతులు చేపట్టాలని బిజెపి వలిగొండ మండల శాఖ డిమాండ్.




**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 18.** భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు శ్రీ బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో గుంతల మాయమైన రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని మండల కేంద్రంలో ధర్నా నిర్వహించడం జరిగింది. మీడియా ద్వారా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి వెంట లోతైన గుంటలు ఏర్పడి, ప్రజలు, ప్రయాణికులు ప్రమాదాలకి గురవుతున్నారని. అందుకు తక్షణమే స్థానిక ఎమ్మెల్యే గారు అధికారులతో మాట్లాడి రోడ్డు మీద పడిన గుంటలను వెంటనే పనులు చేపట్టాలని, లేనియెడల సంబంధిత శాఖ అధికారుల కార్యాలయాల వద్ద భారతీయ జనతా పార్టీ ముట్టడి చేపడుతుందని, అదేవిధంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కూడా ముట్టడిస్తామని వారు ఎమ్మెల్యే గారికి, స్థానిక అధికారులను హెచ్చరించారు. తక్షణమే ఈ రోడ్డుపై ఏర్పడిన గుంటలను పూడ్చని యెడల భారతీయ జనతా పార్టీ జిల్లా పార్టీ తరఫున పెద్ద కార్యక్రమాన్ని తీసుకొని అడుగడుగునా ఎమ్మెల్యే గారిని అడ్డుకుంటామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, సీనియర్ నాయకులు నాయకులు బంధారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ, మంద నరసింహ ముదిరాజ్, రాస వెంకట్,బచ్చు శ్రీనివాస్, పాక పుల్లయ్య, బొడిగే ఆనంద్ , కందుల తానేష, రావుల పద్మారెడ్డి, మండల పదాధికారులు మందుల నాగరాజు, రంజిత్ రెడ్డి, దయాకర్, వెంకటేష్, శ్రీనివాస్, మహేష్ ,మండల నాయకులు వెంకటేష్, ఎర్రవోలు జంగయ్య, అరుణ్, మచ్చగిరి, అశోక్, లింగస్వామి వివిధ గ్రామాల నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేరు మార్పిడికి.. పెళ్లి సర్టిఫికెట్‌కు ముడుపులే!

- మీకు లక్ష వస్తోంది.. మాకు ఎంత ఇస్తారు
- పంచాయతీ కార్యాలయాల్లో సేవలకు 'రేట్లు' నిర్ణయించారా?
- కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్ల తీరుపై ప్రజల్లో ఆగ్రహం




**సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఆగస్టు 18 2026:** గ్రామ పంచాయతీల్లో ప్రజలకు అందాల్సిన సేవల పేరుతో అదనపు వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఆస్తుల మ్యూటేషన్ (పేరు మార్పిడి) కోసం రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు, కళ్యాణలక్ష్మి పథకానికి అవసరమైన మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం కూడా ఇదే స్థాయిలో డబ్బులు అడుగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో కొందరు పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లు లబ్ధిదారులను డబ్బులు అడుగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

**మ్యూటేషన్‌కు రూ.2 వేల నుంచి రూ.3 వేలా?**

వారసత్వంగా వచ్చిన ఆస్తిని తమ పేరుపైకి మార్చుకోవడం, కొనుగోలు చేసిన ఇల్లు లేదా స్థలాన్ని పాత యజమాని పేరు నుంచి కొత్త యజమాని పేరుపైకి మార్చుకోవడం వంటి మ్యూటేషన్ ప్రక్రియ కోసం పంచాయతీని ఆశ్రయించే ప్రజల నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు డబ్బులు అడుగుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దరఖాస్తు ప్రక్రియ, రికార్డుల పరిశీలన, పేరు మార్పిడి వంటి పనుల పేరుతో అదనపు మొత్తాలు తీసుకుంటున్నారని పలువురు చెబుతున్నారు.
ప్రభుత్వ నిబంధనల ప్రకారం మ్యూటేషన్‌కు నిర్ణీత రుసుము ఏమైనా ఉంటే అది ఎంత? అదనంగా వసూలు చేస్తున్న మొత్తాలకు రసీదులు ఎందుకు ఇవ్వడం లేదనే ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి.

**మ్యారేజ్ సర్టిఫికెట్‌కూ డబ్బుల డిమాండ్?**

కళ్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సహాయం పొందేందుకు మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం కావడంతో పంచాయతీ కార్యాలయాలను ఆశ్రయించే లబ్ధిదారుల నుంచి కూడా రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో కొందరు కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లు డబ్బులు అడుగుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నట్లు సమాచారం.
పథకం ద్వారా ఆర్థిక సహాయం పొందాల్సిన పేద కుటుంబాలు సర్టిఫికెట్ కోసం కూడా అదనపు మొత్తాలు చెల్లించాల్సి వస్తే ప్రభుత్వ పథకాల ఉద్దేశమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**మీకు లక్ష రూపాయలు వస్తున్నాయి..**

కొందరు పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లు కళ్యాణలక్ష్మి లబ్ధిదారులతో మాట్లాడుతూ "మీకు లక్ష రూపాయలు వస్తున్నాయి కదా.. మాకు కూడా కొంత సాయం చేయండి" అంటూ డబ్బులు అడుగుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ పథకం కింద వచ్చే ఆర్థిక సహాయాన్ని సాకుగా చూపి లబ్ధిదారుల నుంచి డబ్బులు అడగడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**అధికారిక రుసుము ఎంత?**

మ్యూటేషన్, మ్యారేజ్ సర్టిఫికెట్ వంటి సేవలకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములు ఉంటే వాటిని పంచాయతీ కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజలు చెల్లించే ప్రతి మొత్తానికి అధికారిక రసీదు ఇవ్వాలని, రసీదు లేకుండా అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలి**

మ్యూటేషన్, మ్యారేజ్ సర్టిఫికెట్ పేరుతో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న వసూళ్లపై మండల, జిల్లా స్థాయి అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లు లబ్ధిదారుల నుంచి డబ్బులు అడుగుతున్నారన్న ఆరోపణలపై వాస్తవాలను నిగ్గుతేల్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
ఆరోపణలు నిజమని విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమంగా వసూలు చేసిన మొత్తాలను తిరిగి ఇప్పించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందే ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సేవలు అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## రాజ్యాంగబద్ధంగానే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు

**బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆడే గజేందర్**

**ఆదిలాబాద్ జిల్లా సీకే న్యూస్ ప్రతినిధి.**



రాజ్యాంగంలోని ఆర్టికల్ 162 కింద రాష్ట్ర ప్రభుత్వానికి సంక్రమించిన కార్యనిర్వాహక ((ఎగ్జిక్యూటివ్)) అధికారాల పరిధిలోనే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి ప్రజా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా అమలు చేస్తోందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ స్పష్టం చేశారు.
ఈ పథకాలపై కొందరు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.రాష్ట్ర పరిధిలోని సంక్షేమ అంశాలపై ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్ (జీవోల) ద్వారా పథకాలను రూపొందించే పూర్తి రాజ్యాంగబద్ధమైన అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు.
ఇందుకు సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ప్రసిద్ధ రాయ్ సాహిబ్ రామ్ జవాయ కపూర్ వర్సెస్ పంజాబ్ రాష్ట్రం తీర్పు స్పష్టమైన న్యాయ ఆధారమని గుర్తుచేశారు.
ఈ పథకాలు ప్రభుత్వ విచక్షణతో కూడిన ఎగ్జిక్యూటివ్ వెల్ఫేర్ స్కీమ్స్ మాత్రమేనని, ఇవి డెలిగేటెడ్ లెజిస్లేషన్ పరిధిలోకి రావని, అలాగే ప్రభుత్వం శాసనసభ విధులను (ఎసెన్షియల్ లెజిస్లేటివ్ ఫంక్షన్) తన చేతుల్లోకి తీసుకుందనడం పూర్తిగా అవగాహనారాహిత్యమని కొట్టిపారేశారు.
పక్కాగా ఆర్థిక నిబంధనల అమలు..ప్రజాధనాన్ని ఎలాంటి నియంత్రణ లేకుండా ఖర్చు చేస్తున్నారనే ఆరోపణలు వాస్తవానికి విరుద్ధమని ఆయన మండిపడ్డారు. ఈ పథకాలకు కేటాయించే ప్రతి రూపాయికి రాష్ట్ర బడ్జెట్ ద్వారా శాసనసభ పక్కాగా ఆమోదం తెలుపుతుందని వివరించారు
ట్రెజరీ రూల్స్, ఫైనాన్షియల్ కోడ్ మరియు ఇతర ప్రభుత్వ ఆర్థిక నిబంధనలకు కట్టుబడే నిధులు విడుదలవుతాయని స్పష్టం చేశారు.కఠినమైన వెరిఫికేషన్ మెకానిజం..పథకాల లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అక్రమాలకు తావులేదని,
అర్హత, ఆదాయ పరిమితి, వయస్సు, ఆధార్ కార్డు మరియు వివాహ ధృవీకరణ వంటి అంశాలపై నిర్దిష్ట నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా వివాహ సమయానికి వధువుకు 18 సంవత్సరాలు పూర్తి కావడం తప్పనిసరి అని, ఆర్డీఓ (=ణూ), తహశీల్దార్ (వీ=ూ) స్థాయి అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి పరిశీలన (వెరిఫికేషన్ మెకానిజం) జరిగిన తర్వాతే సాయం అందుతుందని పేర్కొన్నారు. పేద ప్రజల కల్యాణానికి అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలను ప్రజలు నమ్మరని, రాష్ట్రంలో ప్రజా పాలన దిగ్విజయంగా కొనసాగుతోందని బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ ధీమా వ్యక్తం చేశారు.

## ఆర్ ఎక్స్‌పర్ట్ ఆధ్వర్యంలో,

- ఎల్లమ్మ ఆలయం వద్ద,
- మెగా టెలిమెడిసిన్ ఉచిత వైద్య శిబిరం,



**ఆగస్టు 18 (సీ కే న్యూస్) చేగుంట** చేగుంట మండల్ కర్నాల్ పల్లి గ్రామ ఎల్లమ్మ గుడి ప్రాంగణంలో ఆర్ఎక్స్ పర్ట్ ఆధ్వర్యంలో డిజిటల్ క్లినిక్స్ మెగా టెలిమెడిసిన్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని చేరువ చేయాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో స్థానికులకు ఉచితంగా బీపీ, డయాబెటిస్ (షుగర్) పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, ఆరోగ్య సలహాలు సూచనలు తెలిపారు, దూరభారం, అధిక వైద్య ఖర్చుల భారం లేకుండా గ్రామంలోనే ఇలాంటి ఉచిత వైద్య సేవలు అందించడంపై స్థానిక మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎక్స్ పర్ట్ వైద్య సిబంది, జి యాదగిరి, స్వామి, రమేష్ వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న పోరాట పటిమ స్ఫూర్తిదాయకం: అదనపు కలెక్టర్ రాజేశ్వర్




**ఆదిలాబాదు: జిల్లా సీకే న్యూస్ ప్రతినిధి**

బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక, మొఘల్ సామ్రాజ్య దౌర్జన్యాలపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ కొనియాడారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయన 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి సర్దార్ పాపన్న విగ్రహానికి, చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సామాన్య గీత కార్మిక కుటుంబంలో జన్మించిన సర్వాయి పాపన్న, పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా గెరిల్లా సైన్యాన్ని నిర్మించి సుమారు 21 కోటలను స్వాధీనం చేసుకోవడం సాహసానికి నిదర్శనమని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి స్వాతంత్ర్య సమరయోధులకు, బ్రిటిష్ పాలకులపై పోరాడేందుకు పాపన్న చరిత్ర గొప్ప స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన సర్వాయి పాపన్న ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఆదిలాబాదు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఇంచార్జి బీసీ సంక్షేమ శాఖ అధికారి సునీత కుమారి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, చరణ్ గౌడ్, బిసి, గౌడ సంఘం నాయకులు దత్తు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## బస్వాపురం గ్రామంలో పంట కుంట నిర్మాణం పనులు పరిశీలించిన మండల అధికారులు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**మండల పరిధిలో.బస్వాపురం గ్రామంలో పంటకుంట నిర్మాణం భాగంగా పలువురు అధికారులు సందర్శించినరు వారిలో పంచాయతి రాజ్ డిప్యూటీ కమిషనర్ . డిప్యూటీ సీఈఓ అడిషనల్ జూ౹, ఐజూశీ ౹శ్రీజూశీ ఎంపీడీఓ ఎంపీవో ,ఖవ రఘు కోటయ్య గ్రామ సర్పంచ్ ఆవుల నరసింహారావు ఉపసర్పంచ్ చంద్రకాని నరసింహారావు, గ్రామ సెక్రటరీ రామకృష్ణ పలుగ్రామ కార్యదర్శులు ఖవశీ లు ఉపాధి హామీ అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు

## చింతకాని తహసిల్దార్ కు సన్మానం చేసిన కాంగ్రెస్ మండల నాయకులు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండల తహసిల్దార్ గా కేవలం ఒక సంవత్సర కాలంలోనే సమర్థవంతంగా నిధులు నిర్వహిస్తూ ప్రజలకు అందించిన సేవలకు గుర్తింపుగా ఉత్తమ తహసిల్దారిగా ప్రశంస పత్రం అందుకున్న సందర్భంగా తాసిల్దార్ బాబ్జి ప్రసాద్ గారిని సన్మానించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు, పెంట్యాల అప్పారావు, పునాటి కృష్ణారావు, వడ్డే రవికుమార్,కిలారు బాబురావు వేముల ఆకాష్,కోలా నాగేశ్వరావు, నారపోగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## చింతకానిలో వెలవెలబోయిన ప్రజావాణి కార్యక్రమం

- **ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం చింతకాని మండలంలో వెలవెలబ్రోయింది.**



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం చింతకాని మండలంలో వెలవెలబోయింది ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్న విషయాన్ని ప్రజలకు విశ్రుతుగా తెలియజేయడంలో పంచాయతీ కార్యదర్శులు విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి ప్రజా సమస్యల అధికారులు దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని మండల ప్రజలు. సద్వినియోగం చేసుకోలేకపోయారు కార్యక్రమం ప్రజల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో అధికారులు ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది . ప్రజావాణి వంటి కార్యక్రమాలు పై గ్రామస్తులకు ముందస్తు సమాచారం అందించి వారి సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ కార్యదర్శులు ఆ దిశగ తగిన ప్రచారం చేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ప్రజావాణి కార్యక్రమం లక్ష్యంఎలా నెరవేరుతుంది స్థానికులు ప్రశ్నిస్తున్నారు ఇకనైనా ప్రజావాణి కార్యక్రమం పై గ్రామాల్లో విస్తృత్తశీగా ప్రచారం నిర్వహించి ప్రతి గ్రామం నుంచి ప్రజల తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## లచ్చగూడెం గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులకు శ్రీకారం.



**సి కె న్యూస్ ప్రతినిధి ఇల్లందు.**లచ్చగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన కల్వర్ట్ మరియు సైడ్ డ్రైన్ నశంకుస్థాపన కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు గౌ. శ్రీ కోరం కనకయ్య గారు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

గ్రామ అభివృద్ధికి అవసరమైన మరిన్ని పనులను దశలవారీగా చేపట్టి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో లచ్చగూడెం సర్పంచ్ ఎదలపల్లి వెంకటేశ్వర్లు మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొత్తూరు మున్సిపాలిటీలో గ్రామ దేవతల రెండవ వార్షికోత్సవాలూ

- **భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల రెండవ ఆలయాల వార్షికోత్సవాలు**
- **యాగంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్**
- **భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు**



**షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి ఆగస్టు 18:** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం పరిధిలోని కొత్తూరు మున్సిపాలిటీలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామ దేవతల రెండవ ఆలయాల వార్షికోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఉదయం వేళ నుంచే ప్రారంభమైన పూజా కార్యక్రమాలలో గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజ,పుణ్యాహవాచనం,శ్రీ మైసమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేషార్చనలు, సర్వతోభద్రమండల అర్చన, అష్టోత్తర శతకలశ స్థాపన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ మాదారం హైమావతి నరసింహ గౌడ్,బండి మనిలా కృష్ణ దంపతులు,మాసుల అండాలు అంజయ్య దంపతులు, వడ్ల వాణి విష్ణు చారి దంపతులు హాజరై యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూజారులు నాగరాజ్ శర్మ ను సన్మానించి,భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ చైర్పర్సన్ మాట్లాడుతూ.. కొత్తూరు మున్సిపాలిటీ అభివృద్ధి,ప్రజల శ్రేయస్సు కోసం దేవతల ఆశీస్సులు కోరారు. గ్రామస్థులందరూ ఏకమై పాల్గొనడంతో ఈ వేడుకలు అత్యంత విజయవంతంగా,ఆధ్యాత్మిక ఉత్సాహంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాండగూడెం వేణుగోపాల్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్,కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,కడెంపల్లి సదానందం గౌడ్,కమ్మరి జనార్దన్ చారి,మాజీ సర్పంచ్ జగన్,మాజీ ఎంపీటీసీలు బ్యాగరి యాదయ్య,జంగ గళ్ళ కృష్ణయ్య,మాదారం అనురాధ కృష్ణ గౌడ్,మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,నాయకులు గోవింద్ రెడ్డి,కర్రోళ్ల సురేందర్,కర్రోళ్ల లక్ష్మయ్య,మాసుల లక్ష్మయ్య,శంకర్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,జంగ గళ్ళ శివ కుమార్,వడ్ల బాలరాజ్,శ్రీను ముదిరాజ్,రవి నాయక్, మేకల రాఘవేందర్ యాదవ్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పశువుల కొట్టంగా పాఠశాల భవనం

- **సంవత్సరాలైనా పూర్తి కాని పనులు**
  **కోమట్లగూడెంలో నిలిచిన నిర్మాణం**




**సికె న్యూస్ మహబూబాబాద్ జిల్లా (పతినిధి దుర్గం మురళి ఆగష్టు 18** గంగారం మండలం లోని కోమట్లగూడెం (గామ పంచాయతీ లో విద్యార్థుల కోసం నిర్మిస్తున్న పాఠశాల భవనం అధికారుల నిర్లక్ష్యం తోఆవుల కొట్టంగా మారిపోయింది గంగారం మండలం కోమట్లగూడెం (గామ పంచాయతీ నిర్మిస్తున్న పాఠశాల భవనం నిర్మాణ పనులను మూడు సంవత్సరలలో (పారంభించారు సంవత్సరాలు గడుస్తున్నా పనులు ఇంకా అసంపూర్తిగానే మిగిలి పోయాయి అసంపూర్తిగాఉన్న భవనం లోకి (గామస్తుల ఆవులువచ్చి పడుకుంటున్నాయి పశువుల మలమూ(త విసర్జన తో పాఠశాల (పాంగణమంతా అస్తవ్యస్తంగా తయారైంది రూపురేఖలు మారాల్సిన పాఠశాల భవన ఇలా పశువుల పాకలా మారుతున్నా కాం(టాక్టర్ (పజా (పతినిధులు అధికారులు పట్టించు కోవడం లేదని (పజలు మండిపడుతున్నారు కోమట్లగూడెం విద్యార్థులు చదువుకోలేక ఇతర (గామాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు అధికారులు (పజా (పతినిధులు తక్షణమే స్పందించి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాన్ని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో కి తీసుకరావాలని (గామస్తులు కోరుతున్నాను

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా



**పాలకుర్తి/తొర్రూరు,సి కే న్యూస్** : డివిజన్ కేంద్రంలో బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను తొర్రూరు గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్, వైస్ చైర్మన్ సోమ రజని, మున్సిపల్ కౌన్సిలర్లు పేర్ల జంపన్న, తూర్పాటి రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ.. బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. మొగల్ పాలకులను ఎదిరించి గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన ధీశాలి పాపన్న గౌడ్ అని పేర్కొన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి, ధైర్యసాహసాలు నేటి తరానికి ఆదర్శమని అన్నారు. గౌడ సంఘాల నాయకులు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో బహుజనులంతా ఐక్యంగా ముందుకు సాగి రాజ్యాధికారం దిశగా పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌడ జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ గౌడ్, జీఎస్పీఎస్ అధ్యక్షుడు దికొండ శ్రీనివాస్ గౌడ్, కేఎస్పీఎస్ గౌరవ అధ్యక్షుడు శామకూరి ఐలయ్య గౌడ్, అధ్యక్షుడు నాగపురి అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కుంభం మహేష్‌కుమార్ గౌడ్, ఎస్ఎస్పీజీఏ అధ్యక్షుడు చీకటి అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గుర్రం వెంకన్న గౌడ్ తదితర గౌడ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అలాగే మోడెం వెంకన్న గౌడ్, దేశగాని కుమార్ గౌడ్, కోటగిరి కుమార్ గౌడ్, తాళ్లపల్లి బిక్షం గౌడ్, శీలం లింగన్న గౌడ్, పెరుమాండ్ల రవి గౌడ్, తాండాల ఎల్లా గౌడ్, రావుల రాములు, చల్లపల్లి హేమాద్రి గౌడ్, బొమ్మగాని ఓం ప్రకాష్, మోడెం సోమ నరసయ్య, మద్దెల యాకన్న, బోలగాని మహేష్, క్రాంతి, బొమ్మగాని మనోజ్, బొమ్మెర రాజేష్, బుచ్చి రాములు, బొలగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన చైర్మన్ అంబాటి ప్రభాకర్

- **ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మేక గూడా**
- **సహకార సంఘానికి సహకరించండి అభివృద్ధిలో ముందు ఉండండి**
- **రైతుల అభివృద్ధే నా లక్ష్యం**
- **మేకగూడ పిఎస్సిఎస్ చైర్మన్ అంబటి ప్రభాకర్**

**షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి ఆగస్టు 18** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం నందిగామ మండలంలోని మేకగుడా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పాలకవర్గం,అధికార సిబ్బంది కలిసి పనిచేస్తామని మేకగూడ పిఎస్సిఎస్ చైర్మన్ అంబటి ప్రభాకర్ అన్నారు. మంగళవారం నందిగామ మండలంలోని మేకగూడ పిఎసిఎస్ చైర్మన్ అంబటి ప్రభాకర్ అధ్యక్షతన గ్రామీణ స్థాయిలో రైతులకు ఆర్థిక చేయూతనిచ్చే సహకార వ్యవస్థలో అత్యంత కీలకమైన మరియు అట్టడుగు స్థాయి యూనిట్ ఇది రైతులకు స్వల్పకాలిక దీర్ఘకాలిక రుణాలు అందించడంతో పాటు ఎరువులు విత్తనాలు సరపర చేయడం మరియు ధాన్యం కొనుగోలు వంటి సేవలను నిర్వహిస్తుంది అని అన్నారు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అంబటి ప్రభాకర్ మాట్లాడుతూ..సొసైటీ ఆర్థిక వనరులు,పంట, దీర్ఘకాలిక రుణ బకాయిల వసూళ్లు,రుణాల మంజూరు తదితర అంశాలపై సమీక్షిస్తూ సమావేశంలో చర్చించారు. అదే విధంగా ప్రస్తుత పాలకవర్గ సభ్యులందరూ ఎలాంటి ఆర్భాటాలకు ప్రచారాలకు తావు ఇవ్వకుండా రైతులను సొసైటీని అభివృద్ధి పదంలో నడిపించడానికి పాలకవర్గ సభ్యులందరికీ కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ విగ్నేశ్వర్ రెడ్డి,డైరెక్టర్లు ఎం శ్రీను,ఎం ప్రవీణ్ రెడ్డి,పాముల శ్రీనివాస్,కేశముని రమేష్, సభావత్ శంకర్,మల్లికార్జున్ రెడ్డి,చాకలి యాదయ్య,ఎమ్మె శ్రీశైలం,ఎల్లారం రవీందర్ రెడ్డి, ఫరీదా బేగం,మామిళ్ళపల్లి మానెమ్మ,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## టేకులపల్లి కస్తూరిబా బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎమ్మెల్యే కోరం కనకయ్య గారి ఆకస్మిక తనిఖీ.



**సికె న్యూస్ ప్రతినిధి ఇల్లందు.**

టేకులపల్లి మండలంలోని “కస్తూరిబా బాలికల ఆశ్రమ పాఠశాలను” ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు గౌ. శ్రీ కోరం కనకయ్య గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని పరిశీలించి, భోజనం నాణ్యత, రుచి మరియు మెనూ గురించి విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యాబోధన, పాఠశాల పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య గారు, విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే ప్రధాన పునాది అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడే స్థాయికి ఎదగాలని సూచించారు.

విద్యార్థుల సమస్యలను తెలుసుకుని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గారు హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

## గుడుంబా ముడిపదార్థాల విక్రయాలపై పోలీసుల హెచ్చరిక



**సి కే న్యూస్,తొర్రూరు** : గుడుంబా తయారీకి అవసరమైన ముడిపదార్థాల విక్రయాలపై పోలీసులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా తొర్రూరులో కిరాణా వర్తకుల సంఘం సభ్యులతో సీఐ గణేష్, ఎస్సై మహేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి ఐ, ఎస్సై మాట్లాడుతూ.. గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం సరఫరా తగ్గుతున్న నేపథ్యంలో తయారీదారులు చక్కెరతో పాటు ఇతర ముడిపదార్థాల వైపు దృష్టి సారించే అవకాశం ఉందన్నారు. కిరాణా వ్యాపారులు గుడుంబా తయారీదారులకు చక్కెర, ఇతర ముడిపదార్థాలను విక్రయించి సహకరించవద్దని సూచించారు.

నిషేధిత గుడుంబా తయారీకి అవసరమైన వస్తువులను విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గణేష్, ఎస్సై మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. గుడుంబా నిర్మూలనకు పోలీసులకు వర్తకులు సహకరించాలని కోరారు.

# గౌడ్ వంశ గర్వానికి, ధైర్యానికి ప్రతిక - సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

- గౌడులు, గీత కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

**సికే న్యూస్ , ఆగస్టు 18, ఇల్లందు ప్రతినిధి :-** బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందని గౌడులు, గీత కార్మికులు కోరుతున్నారు. అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కల్పించాలనే ఆలోచనతో పాపన్న గౌడ్ సాగించిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం కూడా పాపన్న గౌడ్‌ను బహుజనులకు ఆదర్శంగా పేర్కొంటూ ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టింది.

### ఏజెన్సీలో గీత వృత్తికి ప్రత్యేక పరిస్థితులు

ఇల్లెందు ఏజెన్సీ ప్రాంతంలో తరతరాలుగా గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గౌడ కుటుంబాలు తమ సంప్రదాయ వృత్తిని కొనసాగించడంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని వాపోతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల ప్రత్యేక చట్టాలు, భూమి--అటవీ సంబంధిత నిబంధనలు, తాటి చెట్ల వినియోగానికి సంబంధించిన అనుమతులు, సహకార సంఘాల వ్యవస్థ తదితర అంశాల కారణంగా గీత కార్మికులకు ఇతర ప్రాంతాలతో సమానంగా అవకాశాలు అందడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది.

వృత్తి చేసుకునే అవకాశం, తాటి చెట్లకు సంబంధించిన హక్కులు, భద్రతా పరికరాలు, ప్రమాద బీమా, పెన్షన్, పిల్లల విద్య, ప్రత్యామ్నాయ ఉపాధి వంటి అంశాల్లో ఏజెన్సీ ప్రాంత గీత కార్మికులకు ప్రత్యేక విధానం అవసరమని వారు కోరుతున్నారు.



### ప్రభుత్వ పథకాలు అందరికీ చేరాలి

తెలంగాణలో గీత కార్మికుల కోసం ప్రత్యేక సహకార సంస్థలు, ఆర్థిక సహాయ పథకాలు అమలులో ఉన్నాయి. గీత కార్మికుల సహకార ఆర్థిక సంస్థ ప్రస్తుతం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. అయితే ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే గీత కార్మికులకు కూడా ఈ పథకాలు ఎలాంటి మధ్యంతర అడ్డంకులు లేకుండా అందేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది.

### ప్రత్యేక చట్టం కోసం డిమాండ్

పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే గౌడులు, గీత కార్మికుల సమస్యలను ప్రత్యేకంగా అధ్యయనం చేసి "ఏజెన్సీ గీత కార్మికుల సంక్షేమం మరియు సంప్రదాయ వృత్తి పరిరక్షణకు ప్రత్యేక చట్టం" తీసుకురావాలని గౌడులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ చట్టం ద్వారా తాటి చెట్ల వినియోగానికి స్పష్టమైన విధానం, వృత్తి హక్కుల పరిరక్షణ, ప్రమాద బీమా, భద్రతా పరికరాలు, పిల్లలకు విద్యా సహాయం, వృద్ధ గీత కార్మికులకు పెన్షన్, ఉపాధి--ఆర్థిక సహాయం, తాటి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

పాపన్న గౌడ్ పోరాడింది కేవలం తన కోసం కాదు.. అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం. నేడు ఆయన జయంతి సందర్భంగా ఏజెన్సీ గౌడులు, గీత కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం ద్వారా ఆ మహనీయుడి స్ఫూర్తికి నిజమైన నివాళి అర్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక

**గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై గద్వాల నియోజకవర్గం సర్పంచులు పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ..**




**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల**

సర్పంచులు గ్రామాలను ఆదర్శవంతమైన తీర్చిదిద్దాలి

సర్పంచులు పదవి కాలంలో చేసిన అభివృద్ధి గ్రామాలలో చిరస్థాయిగా ఉంటుంది..

ఈరోజు గద్వాల నియోజకవర్గంలోని ధరూర్ మండలంలో కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం నందు గద్వాల నియోజకవర్గంలో సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి పై అవగాహన సదస్సు కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ప్రోగ్రాం ఇంచార్జ సురేష్ హాజరయ్యారు....

ఎమ్మెల్యే కి మాజీ వైస్ ఎంపీపీ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు...

ప్రోగ్రాం ఇంచార్జ్ మాట్లాడుతూ...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృతంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు సీతక్క ఆధ్వర్యంలో గ్రామాలను అభివృద్ధి చేసే విధంగా నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలు సర్పంచులు గ్రామాలలో ఒక ప్రణాళిక బద్దంగా క్రమబద్ధంగా ఒకదాని తర్వాత ఒకటి గ్రామాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ గ్రామాలలో ముందుగా పారిశు ద్ధ్యము , పచ్చదనను స్వచ్ఛతను ఏర్పాటు చేసి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.

గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామంలో నిర్వహించడం జరిగింది మండల కేంద్రంలో అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్లతో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది దీని ద్వారా సర్పంచ్లు మీ మీ గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలను చేసుకుని విధానము వివరంగా వివరించడం జరుగుతుంది గ్రామాల అభివృద్ధి కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను కేటాయించడం జరుగుతుంది గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రము దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ...

గద్వాల నియోజకవర్గం లో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు గ్రామపంచాయతీ పైన అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆలోచించి గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి కార్యక్రమం గ్రామ పంచాయతీలు సర్పంచులు నిర్వహించాల్సిన విధివిధానాలు గురించి వివరించడం జరిగింది.

గతంలో గత ప్రభుత్వంలో సర్పంచులు గ్రామాలలో అనేకమైన అభివృద్ధి కార్యక్రమాలు చేశారు వైకుంఠ ద్వామాలు, డంపింగ్ యార్డు, రైతు వేదికలు పల్లె ప్రకృతి వనాలు అంటే కార్యక్రమాలను నిర్వహించడంతో గ్రామాలలో చిరస్థాయి మైన గా ఉన్నది ఫలానా సర్పంచ్ పదవి కాలంలో అభివృద్ధి కార్యక్రమం జరిగిందని తెలుస్తుంది అని తెలిపారు కాబట్టి నూతనంగా ఎన్నికైన సర్పంచులు కూడా ప్రస్తుతం ఈ గ్రామాలలో గ్రామపంచాయతీ భవనాలు అంగన్వాడి భవనాలను మహిళ భవనాలను, వ్యవసాయ గోదాములు గ్రామంలో నిర్మాణం చేయడం వల్ల పలానా సర్పంచ్ పదవి కాలంలో ఈ అభివృద్ధి కార్యక్రమం జరిగిందని గ్రామాలలో చిరస్థాయిగా నిలిచిపోతుంది అని పేర్కొన్నారు.

అదేవిధంగా గ్రామ అభివృద్ధి కొరకు సర్పంచ్ పంచాయతీ సెక్రటరీ సమన్వయంతో పనిచేసే గ్రామాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి గ్రామ అభివృద్ధికి తోడ్పాటు కావాలని పేర్కొన్నారు.

ప్రతి గ్రామంలో ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దాలంటే గ్రామంలో కలిసికట్టుగా ఉంటేనే గ్రామం అన్ని విధాలుగా అన్ని రంగాల్లో అభివృద్ధి కావడానికి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

గ్రామ అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు..

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రాజశేఖర్, జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకులు రాధాకృష్ణారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, జెడ్పి సీఈవో, ఎంపీడీవోలు అధికారులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలు

- పాలకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో వేడుకలు
- కేక్ కట్ చేసి మిఠాయిల పంపిణీ.. అన్నదానం, రక్తదాన కార్యక్రమాలు

**పాలకుర్తి,సి కే న్యూస్ :** టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వివిధ మండలాలు, గ్రామాల్లోని కాంగ్రెస్ నాయకులు మండల కాంగ్రెస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఝాన్సీరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో కేకులు కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. పలుచోట్ల పార్టీ జెండాలు, బ్యానర్లు ఏర్పాటు చేసి జన్మదిన వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఝాన్సీరెడ్డి ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తు చేసుకుంటూ నాయకులు, కార్యకర్తలు ఆమెకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.

### అన్నదానం, రక్తదానంతో సేవా కార్యక్రమాలు

జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేదలు, నిరుపేదలు, ప్రజలకు అన్నదానం చేపట్టడంతో పాటు అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే రక్తదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. పలువురు యువకులు, పార్టీ కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా



కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఝాన్సీరెడ్డి పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని అన్నారు. ముఖ్యంగా పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ వారి అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు.

### అభివృద్ధి కోసం నిరంతర కృషి

పాలకుర్తి నియోజకవర్గంలో విద్య, వైద్యం, రహదారులు, మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు తదితర అంశాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ఝాన్సీరెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని నాయకులు తెలిపారు. నియోజకవర్గ ప్రజలతో మమేకమై వారి సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, అవసరమైన చోట ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ఆమె నాయకత్వంలో పాలకుర్తి నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, వివిధ విభాగాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఝాన్సీరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలుచోట్ల నిర్వహించిన సేవా కార్యక్రమాలు, వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

## ధైర్యానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.

**బిజెపి పార్టీ జిల్లా నాయకులు కందుల తానేష్ గౌడ్.**



**సీ కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 18.**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం కేంద్రంలో మెయిన్ రోడ్డు రాజీవ్ గాంధీ చౌరస్తాలో.

గౌడ వంశ గర్వానికి ధైర్యానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించినారు.

మీడియా ద్వారా జిల్లా నాయకులు మండల నాయకులు బందారపు లింగస్వామి గౌడ్ కందుల తానేష్ గౌడ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉన్నదని అణగారిన వర్గాల ఆత్మగౌరవం సామాజిక మానవత్వం కల్పించాలని ఆలోచనతో పాపన్న గౌడ్ సాగించిన పోరాటం నేటికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని..

తెలంగాణ ప్రభుత్వం కూడా పాపన్న గౌడ్ ను బహుజనులకు ఆదర్శంగా పేర్కొంటూ ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బాండు పై ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టిందని మీడియా ద్వారా మాట్లాడినారు.

ఈ కార్యక్రమంలో బొడిగ ఆనంద గౌడ్ రాచకొండ కృష్ణ బోల్ల సుదర్శన్ బందారపు రాములు గౌడ కులస్తుల బాంధవులు బిసి నాయకులు పాల్గొన్నారు.

## ఖమ్మం ట్యాంక్ బండ్‌పై ఘనంగా పాపన్న గౌడ్ జయంతి



**సి కే న్యూస్ ఖమ్మం.** ఖమ్మం జిల్లా ఎతీం పార్టీ ఆధ్వర్యంలో బహుజన స్ఫూర్తి ప్రదాత, బడుగు బలహీన వర్గాల స్ఫూర్తిప్రదాత, బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ట్యాంక్ బండ్‌పై నిర్వహించిన జయంతి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘాల జీూజ నాయకులు అమరగాని వెంకన్న గౌడ్ పాల్గొని పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

బహుజనుల ఆత్మగౌరవం కోసం పోరాడిన పాపన్న గౌడ్ గారి ఆశయాలను నేటి తరానికి చాటి చెప్పాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ఆయన స్ఫూర్తితో బహుజన రాజ్య సాధన దిశగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

జై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్!ఈ యొక్క కార్యక్రమం లో ఎతీం నాయకులు పగడాల నాగరాజు వీరేందేర్

పర్సగాని గోపి దీూా పార్టీ యువజన నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగబద్ధంగానే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు

- బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆడే గజేందర్

**ఆదిలాబాద్ జిల్లా సీకే న్యూస్ ప్రతినిధి.**



రాజ్యాంగంలోని ఆర్టికల్ 162 కింద రాష్ట్ర ప్రభుత్వానికి సంక్రమించిన కార్యనిర్వాహక ((ఎగ్జిక్యూటివ్)) అధికారాల పరిధిలోనే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి ప్రజా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా అమలు చేస్తోందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ స్పష్టం చేశారు.

ఈ పథకాలపై కొందరు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.రాష్ట్ర పరిధిలోని సంక్షేమ అంశాలపై ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్ (జీవోల) ద్వారా పథకాలను రూపొందించే పూర్తి రాజ్యాంగబద్ధమైన అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు.

ఇందుకు సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ప్రసిద్ధ రాయ్ సాహిబ్ రామ్ జవాయ కపూర్ వర్సెస్ పంజాబ్ రాష్ట్రం తీర్పు స్పష్టమైన న్యాయ ఆధారమని గుర్తుచేశారు.

ఈ పథకాలు ప్రభుత్వ విచక్షణతో కూడిన ఎగ్జిక్యూటివ్ వెల్ఫేర్ స్కీమ్స్ మాత్రమేనని, ఇవి డెలిగేటెడ్ లెజిస్లేషన్ పరిధిలోకి రావని, అలాగే ప్రభుత్వం శాసనసభ విధులను (ఎసెన్షియల్ లెజిస్లేటివ్ ఫంక్షన్) తన చేతుల్లోకి తీసుకుందనడం పూర్తిగా అవగాహనారాహిత్యమని కొట్టిపారేశారు.

పక్కాగా ఆర్థిక నిబంధనల అమలు..ప్రజాధనాన్ని ఎలాంటి నియంత్రణ లేకుండా ఖర్చు చేస్తున్నారనే ఆరోపణలు వాస్తవానికి విరుద్ధమని ఆయన మండిపడ్డారు. ఈ పథకాలకు కేటాయించే ప్రతి రూపాయికి రాష్ట్ర బడ్జెట్ ద్వారా శాసనసభ పక్కాగా ఆమోదం తెలుపుతుందని వివరించారు

ట్రెజరీ రూల్స్, ఫైనాన్షియల్ కోడ్ మరియు ఇతర ప్రభుత్వ ఆర్థిక నిబంధనలకు కట్టుబడే నిధులు విడుదలవుతాయని స్పష్టం చేశారు.కఠినమైన వెరిఫికేషన్ మెకానిజం..పథకాల లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అక్రమాలకు తావులేదని,

అర్హత, ఆదాయ పరిమితి, వయస్సు, ఆధార్ కార్డు మరియు వివాహ ధృవీకరణ వంటి అంశాలపై నిర్దిష్ట నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా వివాహ సమయానికి వధువుకు 18 సంవత్సరాలు పూర్తి కావడం తప్పనిసరి అని, ఆర్డీఓ (=ఙూ), తహశీల్దార్ (వీ=ూ) స్థాయి అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి పరిశీలన (వెరిఫికేషన్ మెకానిజం) జరిగిన తర్వాతే సాయం అందుతుందని పేర్కొన్నారు. పేద ప్రజల కల్యాణానికి అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలను ప్రజలు నమ్మరని, రాష్ట్రంలో ప్రజా పాలన దిగ్విజయంగా కొనసాగుతోందని బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ ధీమా వ్యక్తం చేశారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి జయంతి వేడుకల్లో పాల్గొన్న

- బి.యస్.కేశవ్ మరియు గద్వాల పట్టణ మున్సిపల్ కౌన్సిలర్స్



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :**ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌక్ సమీపంలో గల బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి శ్రీ బి.యస్.కేశవ్, మున్సిపల్ కౌన్సిలర్లు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నర్సింహా మోహన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కోటేష్ చిత్తర్ కిరణ్ రంజిత్ భాను రామకృష్ణ కమ్మరిరాము శేఖర్ నాయుడు కుర్వపల్లయ్య బీచుపల్లి రామాంజినేయులు జమ్మిచేడు రాములు ప్రభాకర్ మధు వీరేష్ కామేష్ కేశవులు వడ్డేకృష్ణ రాముడు మరియు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్**

**అదిలాబాద్ జిల్లా.సి.కె. ప్రతినిధి..**



అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్ స్పష్టం చేశారు. ఏ చట్టాలకూ లోబడి కాకుండా, కేవలం నిజమైన లబ్ధిదారులకు మేలు చేయాలనే గొప్ప సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. 2014లో ప్రారంభమైన ఈ సంక్షేమ పథకాలు, కాలక్రమేణా ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీ, ఈబీసీ వర్గాలకు కూడా విస్తరించి నేడు లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు.ఇప్పటివరకు ఈ పథకాల ద్వారా లబ్ధిదారులకు చేకూరిన భారీ ప్రయోజనాల వివరాలను ఆయన వెల్లడించారు.కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టుకు సమర్పించిన అధికారిక లెక్కల ప్రకారం, పథకాల ప్రారంభం నుండి ఇప్పటివరకు ఏకంగా ?16,375.87 (పదహారు వేల మూడువందల డెబ్భై ఐదు కోట్ల ఎనభై ఏడు లక్షలు) ఖర్చు చేసి, మొత్తం 16,78,347 మంది లబ్ధిదారులకు నేరుగా ఆర్థిక సహాయం అందించినట్లు ఆయన తెలిపారు.వివిధ వర్గాలకు అందిన లబ్ధి వివరాలు ఇలా ఉన్నాయి.

బీసీ వెల్ఫేర్: అత్యధికంగా 7,79,401 మంది లబ్ధిదారులకు ?7,803.05 కోట్ల భారీ సాయం అందింది.

మైనారిటీ వెల్ఫేర్: 3,62,769 మంది లబ్ధిదారులకు ?3,204.83 కోట్లు ఖర్చు చేశారు.

ఎస్సీ వెల్ఫేర్: 2,73,164 మంది లబ్ధిదారులకు ?2,734.81 కోట్ల ఆర్థిక ఊతం లభించింది.

ఎస్టీ వెల్ఫేర్: 1,79,939 మంది లబ్ధిదారులకు ?1,801.48 కోట్ల ప్రయోజనం చేకూరింది.

ఈబీసీ వెల్ఫేర్: 83,074 మంది లబ్ధిదారులకు ?831.70 కోట్ల నిధులు విడుదలయ్యాయి.

సామాన్య, పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న ఇటువంటి ప్రజా రంజక పాలన నిరంతరం కొనసాగాలని, రాబోయే రోజుల్లోనూ "ఔర్ ఏక్ బార్ కాంగ్రెస్ సర్కార్" (మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం) నినాదంతో ప్రజా సంక్షేమ పాలనను మరింత ముందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్తారని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువ

**రైతులు బోర్లవద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి**



**ఆగస్టు 18 (సీ కే న్యూస్) చేగుంట**ఎల్‌నినో ప్రభావం కారణంగా వానాకాలం వరి పంట సాగు తక్కువ వర్షపాతం లోటు, నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి వినియోగాన్ని తగ్గించుకునేందుకు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారి ఎం. హరిప్రసాద్ సూచించారు. మంగళవారం చేగుంట మండలంలోని మక్కారాజ్‌పేట గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అలానే ప్రభుత్వం సబ్సిడీల ద్వారా తక్కువ నీరు పోసే బోర్ల వద్ద ఇంకుడు గుంత నిర్మాణం చేసుకోవాలని తెలిపారు, వరి పంటకు అధిక నీరు అవసరమవుతున్న నేపథ్యంలో, నీటి వనరుల లభ్యతను దృష్టిలో ఉంచుకుని కంది, పెసర, మినుము, శనగ, మొక్కజొన్న, జొన్న, సజ్జ, వేరుశనగ, నువ్వులు తదితర ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటి ఆదాతో పాటు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవచ్చని వారు కోరారు. అనంతరం ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి హేమ భార్గవి మండల వ్యవసాయ ఏఈ హరి ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) కళ్యాణి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ధైర్యానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.



**బిజెపి పార్టీ జిల్లా నాయకులు కందుల తానేష్ గౌడ్.**

**సీ కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 18.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం కేంద్రంలో మెయిన్ రోడ్డు రాజీవ్ గాంధీ చౌరస్తాలో.

గౌడ వంశ గర్వానికి ధైర్యానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించినారు.

మీడియా ద్వారా జిల్లా నాయకులు మండల నాయకులు బందారపు లింగస్వామి గౌడ్ కందుల తానేష్ గౌడ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉన్నదని అణగారిన వర్గాల ఆత్మగౌరవం సామాజిక మానవత్వం కల్పించాలని ఆలోచనతో పాపన్న గౌడ్ సాగించిన పోరాటం నేటికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని..

తెలంగాణ ప్రభుత్వం కూడా పాపన్న గౌడ్ ను బహుజనులకు ఆదర్శంగా పేర్కొంటూ ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బాండు పై ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టిందని మీడియా ద్వారా మాట్లాడినారు.

ఈ కార్యక్రమంలో బొడిగ ఆనంద గౌడ్ రాచకొండ కృష్ణ బోల్ల సుదర్శన్ బందారపు రాములు గౌడ కులస్తుల బాంధవులు బిసి నాయకులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి పథకాన్ని ఆపింది కాంగ్రెస్ కాదు-కెసిఆర్ చేసిన అక్రమాలే

- నిధులు లేకుండా చేసి ఇప్పుడు నిందలు వేస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు
- రాష్ట్ర హైకోర్టు స్టే విధించలేదు- జాప్యాన్ని ప్రశ్నించింది
- గత ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులపై బిఆర్ఎస్ శ్వేత పత్రం విడుదల చేయాలి
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి



**అదిలాబాద్ జిల్లా.సి.కె..... న్యూస్......**

తెలంగాణ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనను చూసి ప్రజా ప్రభుత్వంపై బురదల్లే ప్రయత్నం బిఆర్ఎస్ శ్రేణులు చేస్తున్నాయని, ప్రతి సంక్షేమ పథకం కొనసాగుతుందని రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల తెలియజేశారు

గత బిఆర్ఎస్ కెసిఆర్ ప్రభుత్వం చేసిన అవినీతి వల్లనే కోర్టు అసహనం వ్యక్తం చేసిందని, కాగ్ రిపోర్ట్ ప్రకారం 72.91 కోట్ల అవినీతి జరిగిందని దానిని కప్పిపుచ్చుకోవడానికి బిఆర్ఎస్ నాయకులు నాటకాలు ఆడుతున్నరని విమర్శించారు రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ చేసి నిధులు లేకుండా చేసి ఉదేశపూర్వకంగానే నిందలు సబబు కాదని, రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ జడ్జ్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ కు అప్పీలకు వెళ్ళనుందని, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం పారదర్శకంగా, జవాబుదారీతనంగ తీర్చిదిద్దుతూ అర్హులైన ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలకు 30 రోజుల్లో అందే విధంగా రూపకల్పన చేస్తున్నారని తెలిపారు

స్థానిక ఆదిలాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, బోథ్ శాసనసభ్యులకు దమ్ముంటే గత బిఆర్ఎస్ పార్టీ హయాంలో ఇచ్చిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పై శ్వేత పత్రం విడుదల చేయాలని సవాలు విసిరారు

అర్హులకు అందుతున్న సంక్షేమ ఫలాలపై రాజకీయం చేయడం మానేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి సహకరించాలని హితబోధ చేశారు

ఈ కార్యక్రమంలో బోథ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మెరుగు భోజన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎల్మ వినయ రెడ్డి, బోథ్ మండల సర్పంచులు అడప నవీన్, పెందుర్ పృథ్వీరాజ్, మైల నారాయణ, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ తాజా మాజీ చైర్మన్ బోడ్డు గంగారెడ్డి, ఉప సర్పంచ్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుద్దుల అరుణ్ రెడ్డి, సీనియర్ నాయకులు షేక్ అబూద్, మహమ్మద్, రహీముద్దీన్, యువ నాయకులు అలపాటి అచ్చుతానంద రెడ్డి, మడావి జలపతి, తదితరులు పాల్గొన్నారు

# దిశా కమిటీ సమావేశం: కేంద్ర పథకాల అమలుపై సమీక్ష.



**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఆగస్టు 18,**కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అధికారులను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన దిశా కమిటీ సమావేశంలో కేంద్ర పథకాలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఆసుపత్రులకు అవసరమైన సీటీ స్కాన్, ఎంఆర్ఐ తదితర వైద్య పరికరాల కొనుగోలుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. గురుకులాలు, పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా వారానికి కనీసం ఐదు చోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

గిరిజన ప్రాంతాల్లోని 124 ఐసోలేటెడ్ హ్యాబిటేషన్లకు శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఎంపీ పి. బలరాం నాయక్ సూచించారు. అటవీ అనుమతుల సమస్యలతో రహదారులు, విద్యుత్, పట్టా భూములకు సంబంధించిన పనులు, రైతులు ఇబ్బందులు పడకుండా పరిష్కారం చూపాలన్నారు.

పీఎంఏవై, ఉపాధి హామీ పథకాల పెండింగ్ చెల్లింపులను త్వరగా పరిష్కరించాలని, అమృత్ పథకం పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి పైప్‌లైన్ పనులతో దెబ్బతిన్న రహదారులను వెంటనే పునరుద్ధరించాలని ఎంపీ రఘురాం రెడ్డి ఆదేశించారు.

జిల్లాలో ఉపాధి హామీ కింద రూ.17 కోట్ల వేతన బకాయిలు, రూ.50 కోట్ల మెటీరియల్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ అంకిత్ తెలిపారు. గుండాలలో ఐదు పడకల డయాలసిస్ కేంద్రం మంజూరైనట్లు వెల్లడించారు.

జిల్లాలో వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. ఆసుపత్రులు, తాగునీరు, రహదారులు, అటవీ అనుమతుల సమస్యలపై ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు పలు సూచనలు చేశారు.

అనంతరం ఇటీవల మృతి చెందిన అటవీ శాఖ బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్‌కు దిశా కమిటీ సభ్యులు ఒక నిమిషం మౌనం పాటించి నివాళులర్పించారు.

# వైరాలో అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

**బియ్యం వ్యాపారిపై 6ఏ కేసు నమోదు**



**సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఆగస్టు 18 2026**: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లయ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వైరా ప్రాంతంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అష్ణగుర్తి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టుబడింది.

అధికారుల వివరాల ప్రకారం.. అష్ణగుర్తి గ్రామానికి చెందిన బియ్యం వ్యాపారి బలగాని నరసింహారావు ఓ పాడుబడిన ఇంట్లో తెల్లటి ప్లాస్టిక్ సంచుల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. మొత్తం 19 సంచుల్లో సుమారు 9.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు అధికారులు తెలిపారు. దీంతో బియ్యాన్ని సీజ్ చేసి, తదుపరి భద్రతా చర్యల నిమిత్తం సంబంధిత రేషన్ డీలర్‌కు అప్పగించారు. వ్యాపారి నరసింహారావుపై 6ఏ కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

**కొణిజర్లలోనూ తనిఖీలు**

ఇదే సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం కొణిజర్ల మండలంలోని పలు రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసింది. ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తున్న నేపథ్యంలో డీలర్లు నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు బియ్యం అందిస్తున్నారా లేదా అనే అంశంపై అధికారులు పరిశీలించారు.

రేషన్ షాపుల్లోని రికార్డులు, నిల్వలు, పంపిణీ విధానాన్ని తనిఖీ చేసి, లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు బియ్యం అందుతున్నదీ లేనిదీ పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

**అక్రమాలపై నిరంతర నిఘా**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లయ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రతిరోజూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వ, తరలింపు, విక్రయాలపై నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# రమా మల్టీ స్పెషల్ హాస్పిటల్‌లో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

**నల్గొండ జిల్లా సీకే న్యూస్ జిల్లా ప్రతినిధి** మిర్యాలగూడలో సంతానలేమి సమస్యతో బాధపడుతున్న దంపతులకు అండగా నిలిచేందుకు రమా మల్టీ స్పెషల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని 18-08-2026 నాడు నిర్వహించారు డా.సీతా గరిమెల ఫర్టిలైటీ స్పెషలిస్ట్ డా. రమదేవి కన్సల్టెంట్ సంతానలేమికి గల కారణాలను గుర్తించి, అవసరమైన వైద్య పరీక్షలు,

నిపుణుల సలహాలు అందించేందుకు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు రమా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకులు తెలిపారు శిబిరంలో సంతానలేమి సమస్యలు, మహిళల్లో గర్భాశయ సంబంధిత సమస్యలు, పురుషుల్లో సంతానోత్పత్తికి సంబంధించిన సమస్యలపై నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి తగిన వైద్య సలహాలు, సూచనలు అందించనున్నారు ఉచిత వైద్య శిబిరాన్ని సంతానలేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దంపతులు సద్వినియోగం

చేసుకోవాలని ఆసుపత్రి నిర్వాహకులు కోరారు ప్రస్తుత కాలంలో సంతానలేమి సమస్యలకు అనేక కారణాలు ఉండవచ్చని, సరైన సమయంలో నిపుణులను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యకు తగిన పరిష్కార మార్గాలను తెలుసుకోవచ్చని వైద్యులు సూచించారు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేస్తాయని పేర్కొన్నారు.